
ఆదివారం
వార్త
1 సెప్టెంబరు, 2024
HOSPITAL
ప్రాణ 'జ్యోతి'కి
ఏదీ దీపం!

# తారాతీరం



## వెంకటేష్, త్రిష జోడీగా?

తమిళం సినిమా 'మౌనం పేసియాదే' తో కెరీర్ ప్రారంభించిన త్రిష రెండు దశాబ్దాల తరువాత కూడా బిజీ బిజీగా సినిమాలు చేస్తూనే ఉంది. త్రిష ఇప్పటికీ స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్‌గా సినిమాలు చేస్తోంది. అంతేకాకుండా లేడీ ఓరియంటెడ్ సినిమాలకు కూడా మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచి వరుసగా సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం చిరంజీవితో 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా తరువాత వెంకటేష్‌తో కలిసి ఒక సినిమా చేసేందుకు త్రిష అంగీకరించినట్లు సమాచారం.

ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ ఒక చిత్రం చేస్తున్నాడు. అందులో మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్‌లు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. అనిల్ రావిపూడితో చేస్తున్న సినిమా తర్వాత వెంకటేష్ 'సామజవరగమన' చిత్ర రచయిత నందు దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. ఇందులో హీరోయిన్ పాత్ర కోసం త్రిషను సంప్రదించినట్లు తెలుస్తోంది. 'విశ్వంభర' పూర్తయిన తరువాత వెంకటేష్‌తో షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం.



## 'వార్-2' షూటింగ్ వాయిదా?

స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం నటిస్తున్న 'దేవర', 'వార్-2' చిత్రాల కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌తో కలిసి ఎన్టీఆర్ నటిస్తున్న 'వార్-2' ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా.. అని అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాను అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇటీవల దేవర షూటింగులో ఎన్టీఆర్ చేతికి గాయం అయిన సంగతి విదితమే. కొన్ని అనివార్య కారణాల వల్ల 'వార్-2' షూటింగ్ వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ సినిమాను యశ్‌రాజ్ ఫిలింస్ బ్యానర్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

ఆదివారం వార్త
1 సెప్టెంబరు, 2024

## మంచి ముత్యాలు

పొరపాటును సమర్థించుకోవడానికంటే, దానిని సరిదిద్దుకోవటానికే తక్కువ సమయం పడుతుంది.

- లాంగ్‌ఫెలో

## విషయ విశేషం

బడి కష్టాలు.. 4
'సంఘీ'భావం....5
హైడ్రా ఫలవంత ప్రయోగం
కవర్ స్టోరీ..6
ప్రాణ 'జ్యోతి'కి ఏదీ దీపం!
పంటల్ని కాపాడుతుంది....11
ఈవారం కవిత్వం..12
మొక్కల మొక్కులు తీర్చవా!
పాములు కనపడని దేశాలు...14
జాగ్రత్త లేకపోతే బొక్కే...18
కథ.. 20
తీరిన కల
సాహిత్యం..23
జగము నేలిన తెలుగు
పుచ్చు వంకాయలు....25
లక్ష్మీ కటాక్షం కలగాలంటే?.. 29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### గ్రామస్తులకు పాఠాలు చెప్పండి

సాధారణంగా ఈ జనరేషన్ పిల్లలు ఇంటికి రాగానే టీవీలూ, ఫోన్లూ చూస్తుంటారు. లేదంటే హోమ్‌వర్క్ పూర్తి చేశాక వాటి ముందు తిష్టవేస్తారు. తమిళనాడులో మదురైకి దగ్గర్లో ఉన్న కబూర్‌లో మాత్రం చిన్నారులు చకచకా హోమ్‌వర్క్‌లు చేసి పుస్తకాలు ముందేసుకుంటారు. వాళ్లు చదివే కథలు, సైన్స్‌ఫిక్షన్ నవలలూ, మహనీయుల జీవిత చరిత్రల్లో అర్థం కాని విషయాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకుంటారు. ఎందుకంటే వారం రోజుల్లో పుస్తకాన్ని పూర్తిగా చదివి అందులోని విషయాన్ని గ్రామంలోని వాళ్లందరికీ కూడా అర్థమయ్యేలా చెప్పాలి కాబట్టి. పిల్లలు అ పని చేయడానికి కారణం ఆ గ్రామంలోని యూత్ కల్చర్ బృందమే. కొవిడ్ సమయంలో పిల్లలూ, పెద్దలూ సోషల్‌మీడియాకి బానిసల కావడం గమనించిన గ్రామస్తుడు సెల్వరాజ్ వాళ్ల దృష్టిని మళ్లించి పుస్తకపఠనం అలవాటు చేయాలనుకున్నాడు.కంబూర్‌లోని యువకుల సాయంతో ఓ లైబ్రరీని ఏర్పాటు చేసి పిల్లలతో కథలు చదివించి పెద్దలకు వినిపించేవారు. ఆ తరువాత నచ్చిన పుస్తకాన్ని ఇంటికి తీసుకెళ్లి వారంలోగా చదివి ప్రతి శనివారం ఏర్పాటు చేసే గ్రామసభలో చక్కగా వివరించిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పాడు. దాంతో పిల్లలంతా పోటీపడి నచ్చిన పుస్తకాలను చదివి శనివారం నాడు తమకు తోచిన రీతిలో అందులోని విషయాలను వివరిస్తున్నారు. పదిహేనేళ్ల లోపున్న దాదాపు అరవైమంది పిల్లలు పోటీపడుతూ బహుమతులు గెలుచుకుంటున్నారు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# బడి కష్టాలు



**స్కూలు** పిల్లలు ఇంటి ముందు బస్సు ఎక్కి బడిలో దిగి పోవడమే మనకు తెలుసు కానీ, కొన్నిచోట్ల విద్యార్థులకు రోజూ స్కూలుకు వెళ్లడమంటేనే సాహసం. ఇంటి నుంచి స్కూలుకు చేరడానికి ఎత్తయిన పర్వతాలు ఎక్కేస్తారు. పెద్దపెద్ద లోయలు దాటేస్తారు. మరెన్నో ప్రమాదకరమైన కేబుళ్లపైన జారుతూ బడికి చేరుకుంటారు. చూస్తేనే గుండె ఝల్లుమంటున్న ఈ ఫొటోలన్నీ అలాంటి ప్రమాదకరమైన స్కూళ్ల దారులవే. చైనా విలేజ్ అటులీయర్ ఊరి పిల్లలు బడికి వెళ్లడానికి రోజూ ఎత్తుయిన నిచ్చెనల మీద కొండ ఎక్కి దిగాల్సిందే. కొలంబియాలోని చిన్నారులు రియోనీగ్రో నదిపై నుండి అరకిలోమీటరు పొడవునా జిప్‌లైన్ మీదుగా జారుకుంటూ వెళ్లకతప్పదు. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ దేశాల్లో నదులపైన వేలాడే వంతెనలమీద నడచుకుంటూ, తేలియాడే ట్యూబుల్లో కూర్చునీ స్కూలుకు హాజరవుతారు.









## 'సంఘీ' భావం



# హైడ్రా ఫలవంత ప్రయోగం

స్వార్థం రాజ్యమేలుతూ ఉంటే సమాజానికి కలిగే నష్టం అంచనాలకు అందనంతగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితులకు ఏదో ఒకరోజు ముగింపు పలకాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రధానంగా సహజ వనరులను దుర్వినియోగం చేస్తూ అడ్డగోలుగా వ్యవహరించే వారిపై హైడ్రా వంటి సంస్థల ప్రయోగం ఎంతో అవసరం. ప్రస్తుతం సంచలనాలకు వేదికగా ఉన్న హైడ్రాకు ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉంది. ప్రతిపక్ష, స్వపక్ష నేతలు కూడా గట్టిగా ఖండించలేని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ మహానగర శివార్లలో చెరువులు, కుంటలను ఆక్రమించి నీరు నిల్వకు అవకాశం లేకుండా చేసి చిన్నపాటి వర్షానికే వరదలు వచ్చి ముంచెత్తేలా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యం గా కట్టడాలు నిర్మించారు. అధికార పార్టీ అండదండలతో కట్టడాలు కొనసాగాయి. పార్టీ నేతలు కూడా ఎవరికి వారు భవంతులు, ఫామ్‌హౌస్‌లు నిర్మించారు. పెద్దపెద్ద కన్వెన్షన్లు నిర్మించుకుని కోట్లలో ఆదాయాన్ని గడిస్తున్నారు. తమకు అడ్డుతగిలే దమ్ము ఎవ్వరికీ లేదని భావిస్తున్న తరుణంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు అంకురార్పణ జరిగింది. జీహెచ్‌ఎంసీ పరిధితో పాటు శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీల పరిధిలోని రెండు వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో హైడ్రా పరిధి విస్తరించేలా చట్టాన్ని రూపకల్పన చేశారు. హైడ్రాకు సివిల్ సర్వీసెస్‌కు చెందిన కార్యదర్శి లేదా అంతకు మించిన హోదా కలిగిన అంధికారిని కమిషనర్‌గా నియమించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐజీ ర్యాంకులో ఉన్న ఐపిఎస్ అధికారి ఎ.వి.రంగనాథ్‌ను హైడ్రాకు కమిషనర్‌గా నియమించారు. పైగా హైడ్రా పరిధిని ఏకంగా ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరింపచేశారు. జీహెచ్‌ఎంసితో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రాంతాలను విపత్తు నుంచి రక్షణ కల్పించేందుకు వీలుగా హైడ్రా ప్రణాళిక లు సిద్ధం చేస్తోంది. శివారు ప్రాంతాలతోనే కాకుండా హైదరాబాద్ నగరంలో పార్కులు, లేఅవుట్‌ల ఖాళీస్థలాలు, పరిశ్రమల శాఖ స్థలాలు, జలవనరులు అక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించే అధికారాన్ని కల్పించారు. హైడ్రా వీటిని పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ సమయంలో జిల్లా కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ కమిషనర్, పోలీసు కమిషనర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, మున్సిపాలిటీల కమిషనర్లు, గ్రామపంచాయితీలు, జలమండలి, హెచ్‌ఎండిఏ, హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మూసీ నది అభివృద్ధి సంస్థ, విపత్తు శాఖ, పట్టణ జీవ వైవిధ్యం, నీటిపారుదల వంటి అనేక శాఖల అధిపతులు హైడ్రాకు అవసరమైన సహకారాన్ని తప్పనిసరిగా అందించాల్సి ఉంటుంది. అంటే పరోక్షంగా హైడ్రా తీసుకునే ప్రతిచర్యకు తగిన సహకారం అందించే బాధ్యత అధికారులపై ఉంటుంది. దీనితో హైడ్రాకు ప్రత్యేక హోదా లభించినట్లు అవుతుంది. భవన నిర్మాణాల అనుమతులు, నిబంధనల ఉల్లంఘన, శిథిల భవనాలు, పౌరుల భద్రతకు సంబంధించిన పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్తులను పరిశీలించే అధికారం కూడా హైడ్రాకు ఉంటుంది. ఈ క్రమంలో నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ఏ కట్టడాన్ని అయినా కూల్చివేసే పూర్తి అధికారాలు ఉంటాయి. ఈ చర్యకు పైన పేర్కొన్న ప్రభుత్వ శాఖలు పూర్తిగా సహకరించాలి. ఈ సంస్థ హైదరాబాద్ నగరానికి ప్రయోజనం కలిగించే చర్యలు చేపట్టడంతో ప్రజల నుంచి పూర్తి స్థాయి మద్దతు లభిస్తోంది. చెరువులు, కుంటలకు చెందిన భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పిస్తోంది. సహజవనరులను కాపాడటం ద్వారా ప్రకృతిపరంగా వచ్చే విపత్తులను అరికట్టే అవకాశం ఉంటుంది. నగరంలో కాల్వల ఆక్రమణలు, శివారు ప్రాంతాల్లో చెరువులు, కుంటల స్థలాల కబ్జాలో సుమారు వేలాది ఎకరాలు ఉన్నాయి. నగరంలో నాలాలు పూర్తిగా అక్రమణలకు గురయ్యాయి. పాతబస్తీలో తలాబ్‌కట్టలో పూర్తిగా నివాస ప్రాంతం గా మారిపోయింది. నిజాంపేటలో చెరువులను పూడ్చి బహుళ అంతస్తులు నిర్మాణాలు జరిగాయి. వీటన్నింటినీ తొలగించి సాధారణ స్థితికి తీసుకురావడంలో హైడ్రా అత్యంత కీలకంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం ప్రాథమికంగా శివారు ప్రాంతంలోని బఫర్‌జోన్ నిర్మాణాలను తొలగించే పనుల్లో హైడ్రా అధికారులు నిమగ్నమై ఉన్నారు. కబ్జాలకు గురైన ప్రాంతంలో ఇప్పటి వరకు కేవలం రెండు మూడు శాతం మాత్రం విముక్తి కలిగించారు. ఈ పనులు మరింత జోరుగా సాగాలని, మూడు దశాబ్దాల ముందు ఉండే పరిస్థితులు పునరావృతం కావాలని ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ప్రజల మద్దతు అధికంగా ఉండటంతో రాజకీయ నాయకులు హైడ్రాను ప్రతిఘటించేందుకు సాహసించడం లేదు. అయితే ఒక వర్గానికి చెందిన కట్టడాలు మాత్రమే కూలుస్తున్నారని, అన్ని కట్టడాలు కూల్చాలని రాజకీయ నేతలు ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయలేని సాహసానికి ప్రస్తుతం శ్రీకారం చుట్టారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇంకా పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉంది. అక్రమ కట్టడాలు తప్పనిసరిగా తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దీనికి అన్ని రాజకీయ పార్టీలు, వర్గాలు పూర్తిస్థాయిలో సహకరించాలి. కేవలం ఒక వర్గానికి చెందిన కట్టడాలు మాత్రమే కూలుస్తున్నారన్న ఆరోపణలపై దృష్టి సారించాలి. అక్రమంగా నిర్మించిన అన్ని కట్టడాలు కూల్చడం ద్వారా హైడ్రా పనితీరు విమర్శలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. హైడ్రా ఏర్పాటుతో సమాజహితం జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ




# ప్రాణ 'జ్యోతి'కి ఏదీ దీపం!

**కవర్‌స్టోరీ**

**రుద్రరాజు శ్రీనివాసరాజు**

అర్ధరాత్రి స్త్రీలు స్వేచ్ఛగా సంచరించినప్పుడే నిజమైన స్వాతంత్య్రం అని మహాత్మాగాంధీ ఉద్ఘాటించారు. మహాత్ముడు అర్ధరాత్రి అన్నాడు కానీ పట్టపగలే తిరగలేని పరిస్థితి నేడు దాపురించింది. ఇంటి నుంచి వెళ్లిన అమ్మాయి లేదా మహిళ క్షేమంగా తిరిగొస్తుందన్న నమ్మకం లేదు. దారిలో ఎక్కడ ఏ అపాయం పొంచి ఉందో ఊహించ లేని పరిస్థితి. దారిలోనే కాదు తాను పని చేసే చోట అంతే కాదు తన ఇంటిలోకూడా మహిళలకు కనీస భద్రత కరువైన దయనీయస్థితి నేటి మహిళది. ఉయ్యాల తొట్టిలో నెలల పసికందు దగ్గర నుండి పాఠశాలకు వెళ్లే మైనర్ బాలికలు, కళాశాలకు వెళ్లే యువతులు, ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువతులు, వివాహితులు, గర్భవతులు, వృద్ధురాళ్లు, ఇలా వీరిలో ఎవ్వరినీ కూడా మానవ మృగాలు వదిలి పెట్టడం లేదు. వావివరుసలు లేవు, వయసులో చిన్నాపెద్దా విచక్షణ లేదు, చట్టం పట్ల భయభక్తులు అసలే లేవు. ఇలా ఉచ్ఛనీచాలు మరిచి, నిమిషాల కోరిక కోసం పైశాచికంగా వ్యవహరిస్తూ చివరకు చిన్నారులపై కూడా అత్యాచారాలు చేస్తూ మనుషులు మృగాలుగా మారడానికి దారితీస్తున్న సాంఘిక, మానసిక పరిస్థితులు నేడు సమాజంలో నెలకొని ఉన్నాయి. డార్విన్ సిద్ధాంతం ప్రకారం మృగం పరిణామక్రమంలో మనిషిగా అవతరిస్తాడు. కానీ నేటికాల మానవ పరిస్థితులను పరిశీలిస్తే మనిషి పరిణామక్రమంలో మృగంగా అవతరిస్తున్నాడని చెప్పవచ్చు. అయితే వీళ్లను మృగాలు అనే పేరుతో సంభోదించడం కూడా సరికాదేమో. ఎందుకంటే మృగాలకు కూడా ఉచ్ఛనీచాలు ఉన్నాయి. ఎందుకంటే మృగాలు తమ జాతి మృగాలను హత్య చేయవు. హత్యాచారాలు చేయవు. తమ జాతికే చెందిన జంతువులను కులం, మతం, ప్రాంతం, లింగం అంటూ వివక్షతలు చూపవు. సమకాలీన నాగరిక సమాజంలో ఆడబిడ్డగా జన్మించిన పసిబిడ్డ నుండి పండు ముదుసలి వరకూ ఎవరికీ కూడా కనీస భద్రత కల్పించలేని సమాజంలో మనం నివశిస్తున్నాం. పైగా మనం నాగరిక సమాజంలో నివశించే నాగరికులం అని గర్వంగా చెప్పుకుంటున్నాం. ప్రతీగంటకు వయసుతో సంబంధం లేకుండా ఆడబిడ్డలపై జరుగుతున్న అమానుష కృత్యాల గణాంకాలు చూస్తే మానవరూపంలో ఉన్న కీచకుల ఆకృత్యాలను అర్థం చేసుకోవచ్చు. అత్యాచారం అనేది కేవలం మహిళల సమస్యకాదు. సమాజంలోని మానసిక రుగ్మతకు అదొక చిహ్నాం. అడుగంటుతున్న మానవీయ విలువలకు నిలువెత్తు నిదర్శనం. అనేక ఘటనల్లో అత్యాచారానికి పాల్పడిన నిందితులు, బాధితులకు తెలిసినవారై ఉంటున్నారు. విద్యావంతులైన వారు సైతం వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. మహిళలపై ఇంటా బయటా ఆకృత్యాలకు అడ్డుకట్ట వేయడానికి సామాజికంగా జరుగుతున్న ప్రయత్నాలు నామ మాత్రం. అందుకే ఎలాంటి జంకులే కుండా నేరగాళ్లు రెచ్చిపోతున్నారు.

**16 నిమిషాలకో అత్యాచారం**

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గల నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2022 నివేదిక పరిశీలిస్తే ఆందోళన కలిగించే మనిషి తలదించుకునే భయానక విషయాలు బయటపడ్డాయి. భారతదేశంలో ప్రతీ 16నిమిషాలకు ఓ యువతి అత్యాచారానికి గురి అవుతూ ఉంది. మనదేశంలో 2017 నుంచి 2022మధ్య సగటున ప్రతీరోజూ 86 అత్యాచార కేసులు నమోదయ్యాయని ఈ నివేదిక తెలియచేసింది. ఈ ప్రకారం చూస్తే దేశంలో ప్రతీగంటకు నలుగురు మహిళలు అత్యాచారానికి గురవుతున్నారు.

➤ కేంద్ర గణాంకాలు కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ తాజాగా 2023లో ఇచ్చిన నివేదిక పరిశీలిస్తే చాలా ఆశ్చర్యం, ఆవేదన కలుగుతుంది. మహిళలపై జరిగిన హత్యలు అత్యాచారాల విషయంలో నమోదైన కేసుల విషయంలో కేవలం 2శాతం మందికే శిక్షలు పడుతున్నాయని ఆ నివేదికలో పేర్కొనడం జరిగింది. దీనినిబట్టి మహిళల భద్రత విషయంలో మనం ఏవిధంగా రక్షణ కల్పిస్తున్నాం అనేది అర్థం అవుతుంది.

➤ **రక్షణ లేదు**

ప్రధానంగా పనిచేసే మహిళల్లో ఎక్కువశాతం విధులకు వెళ్లి వచ్చేటప్పుడు తమకు రక్షణ లేదని వెల్లడించారని అసోచామ్

సర్వే తేల్చింది. ఢిల్లీ దాని పరిసర ప్రాంతాలతోపాటు ముంబై, పూణె, కోల్‌కత్తా, హైదరాబాద్‌లోని పెద్ద సంస్థలతోపాటు, మధ్యస్థ చిన్నతరహా కంపెనీల్లో పనిచేస్తున్న 5వేల మందిని ఈ సంస్థ సర్వే చేయగా, ఏకంగా 92 శాతం మహిళలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా బీపీఓ, ఐటి అనుబంధ రంగాలు, హాస్పిటాలిటీ, పౌర విమానయానం, నర్సింగ్ హోమ్స్‌లో పనిచేస్తున్న మహిళలు తమకు తగిన రక్షణ లేదని చెబుతున్నారు.

12 సంవత్సరాల క్రితం దేశంలో ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించిన 'నిర్భయ' ఘటనని ఇంకా మనం మరచిపోనేలేదు. హైదరాబాద్‌లో 'దిశ', కాశ్మీర్ 'ఆసిఫా' జ్ఞాపకాలు ఇంకా చెరిగిపోనేలేదు. ఇంతలోనే పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో కోల్‌కత్తాలోని ఆర్జికర్ వైద్యకళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలు అత్యంత పాశవికమైన లైంగిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన హత్యాచార ఘటన దారుణ ఉదంతం యావద్దేశాన్నీ దిగ్భ్రాంతికి గురిచేసింది. పీజీ వైద్యురాలిపై జరిగిన ఈ హత్యాచార ఘటన సభ్యసమాజాన్నే తలదించుకునేలా చేసింది. ఈ కేసులో దోషులుగా తేలిన వారిని ఉరితీయాలంటూ ఎప్పటిమాదిరిగానే డిమాండ్లు వచ్చాయి. అయితే ఇంతటి దారుణ ఘటనను కూడా కప్పిపుచ్చి కీచకులను కాపాడే ప్రయత్నాలు, చేస్తున్న తరుణంలో ఏకంగా సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. జూనియర్ వైద్యులకు మేం న్యాయం చేస్తామని సుప్రీం వైద్యులకు భరోసా ఇచ్చింది. కేసును సీబీఐకి అప్పగించడంతో పాటు 10మంది నిపుణులైన వైద్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసింది. ఘటన జరిగిన ఆర్జీకార్ ఆస్పత్రి ప్రిన్సిపాల్‌పై తీవ్రమైన ఆరోపణలను సుప్రీం విచారణ చేపట్టింది. ప్రిన్సిపాల్ రాజీనామా చేసిన అనంతరం వెంటనే దానికన్నా పెద్ద హాస్పిటల్‌కు ప్రిన్సిపాల్‌గా నియమించడాన్ని బట్టి చూస్తే ప్రభుత్వపెద్దల అండ ఎంతగా ఉందో అర్థం అవుతుంది. ముందు అభయ ఘటనను ఆత్మహత్యగా చూపాలనే ప్రయత్నం ప్రిన్సిపాల్ చేయడం జరిగింది. అంతేకాదు అభయ తల్లిదండ్రులకు మృతదేహాన్ని చూపడంలో కూడా చాలా తాత్సర్యం చేశారు. ఏకంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, అధికార ప్రతినిధి కూడా ప్రిన్సిపాల్ వైఖరిపై అనుమానం వ్యక్తం చేస్తూ అతనిని విచారించి నిజానిజాలు రాబట్టాలని డిమాండ్ చేయడం జరిగింది. సుప్రీంకోర్టు సైతం ప్రిన్సిపాల్ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అతనిని లైడిటెక్టర్ పరీక్ష చేయాలని ఆదేశించడం జరిగింది. సీబీఐ కోర్టుకు ఇచ్చిన ప్రాథమిక నివేదికలో అభయపై జరిగిన అత్యాచారం హత్య ఉదంతానికి సంబంధించి ఆధారాలు చెరిపివేసే ప్రయత్నాలు జరిగాయని పేర్కొనడం. ఇక ముందుముందు అటు సీబీఐ దర్యాప్తు, ఇటు సుప్రీంకోర్టు కొంత చొరవతో అభయ కేసులో ఇంకెన్ని లోతైన అంశాలు బయట పడతామో అనే దాని కోసం వేచి చూడవలసింది.





➤ ఆస్పత్రులపైనా, వాటిలో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బందిపైనా దాడులు జరగడం ఇటీవలకాలంలో పరిపాటిగా మారింది. ఆస్పత్రిలో రోగి మరణిస్తే అందుకు కారణం డాక్టర్లేనంటూ వారిపైనా, ఆస్పత్రిపైనా రోగి తాలూకు బంధువులు దాడులకు పాల్పడుతున్నారు. నాసిరకం వైద్యసేవలు అందించడం, ఎమర్జెన్సీ కేసుల విషయంలోనూ వైద్యులు, సిబ్బంది అలసత్వం ప్రదర్శించడం వంటివి కూడా రోగులు, వారి బంధువుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. సాధారణంగా ఆస్పత్రులలో నర్సులపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు వంటివి ఎక్కువగా చోటు చేసుకుంటూ ఉంటాయి. ఇటు వైద్యులకు, అటు రోగులకు మధ్య అనుసంధానకర్తలుగా ఉంటూ, రోగిని అనుక్షణం కనిపెట్టుకుని ఉండే నర్సులపై రోగులు, వారి బంధువులు ఆకృత్యాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు తరచూ వెలుగుచూస్తూ ఉంటాయి. మరికొన్ని సందర్భాల్లో నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళారోగులపై ఆస్పత్రి సిబ్బంది అత్యాచారాలకు పాల్పడిన ఘటనలు కూడా తక్కువేం కాదు. ఇక మహిళా వైద్యుల విషయానికి వస్తే తోటి వైద్యులు అత్యాచారం జరిపిన ఆకృత్యాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే పూర్తి భద్రతతో ఉండవలసిన పేరుగాంచిన కోల్‌కత్తా వైద్యశాలలో దుండగుడు ప్రవేశించి అత్యంత కిరాతకంగా గావు కేకల మధ్య అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నాలు అందునా హాస్పిటల్ ప్రిన్సిపాల్ ప్రయత్నం చేయడం ఎంత దారుణం. జూనియర్ వైద్యులకు హాస్పిటల్స్‌లో రక్షణ కల్పించలేమా? వారి విధులేమిటి అనే విషయాలను పరిశీలిస్తే..

## జూనియర్ డాక్టర్ల విధులు

సాధారణంగా వైద్యకళాశాలలకు అనుబంధంగా ఉండే హాస్పిటల్స్‌లో సీనియర్ ప్రొఫెషనల్స్ తమ డ్యూటీ అవర్స్ పూర్తి కాగా నే ఇంటికి వెళ్లిపోతారు. పిజి రెసిడెంట్ డాక్టర్లు మాత్రం వర్చువల్ ఆస్పత్రులను నడుపుతుంటారు. సీనియర్లకు బదులు యువట్రయినీ డాక్టర్లే అడ్మిషన్ నుంచి మిగతా అన్ని పనులు చూస్తుంటారు. రెసిడెన్సీ మేన్యువల్ ప్రకారం పిజి రెసిడెంట్ వారానికి 70గంటలు ఆస్పత్రిలో పని చేయవలసి ఉంటుంది. అంటే రోజుకు 11 నుంచి 12గంటల వరకు పని చేయాలి. అయితే అవసరాన్ని బట్టి మరిన్ని పని గంటలు ఎక్కువగా పనిచేయాల్సి వస్తోంది.



యువడాక్టర్ల ఎలాంటి విరామం లేకుండా 36 నుంచి 48గంటలు పనిచేయక తప్పడం లేదు. ఈ విషయం చాలా ఆస్పత్రుల్లో డాక్టర్లకు కనీసం విశ్రాంతి తీసుకోడానికి కూడా తగిన సదుపాయాలు ఉండడం లేదు.

ఆధునిక సదుపాయాలతో వైద్యరంగం ఎంత పురోగమిస్తున్నా జూనియర్ వైద్యుల వెట్టి చాకిరీకి మాత్రం తెరపడటం లేదు. ప్రాణం పోసే వైద్యులే ఒత్తిడితో ప్రాణాపాయ పరిస్థితిల్లో కూరుకుపోతున్నారు. తమతో యంత్రాలకన్నా ఘోరంగా పని చేయిస్తున్నారని జూడాలు తరచూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కోల్‌కత్తాలోని ఆర్జికార్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన రెసిడెంట్ వైద్యురాలు అభయ 36 గంటలుగా నిరంతరాయంగా విధుల్లో ఉన్నట్టు వెల్లడైంది. మనదేశంలో వైద్యరంగంలో ఉన్న మహిళల సంఖ్య తక్కువేం కాదు. మొత్తం వైద్యులలో 23శాతం మంది మహిళా వైద్యులు ఉండగా నర్సింగ్ సేవలు అందించే ఎరిలో 80శాతం మహిళలే ఉన్నారు. వీరు కాకుండా సోషల్ వర్కర్లుగా 100శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు. వైద్యకళాశాలల్లో పీజీ చేస్తున్న జూనియర్ డాక్టర్స్ పూర్తిస్థాయి వైద్యులు కాకపోవడం చేత వారికి మెరుగైన సౌకర్యాలు అందించడం లేదు. వారికి వచ్చిన స్టైఫండ్‌తోనే సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఇక ప్రైవేట్ వైద్యశాలల్లో చూస్తే జూనియర్ డాక్టర్లకు చెందిన స్టైఫండ్ సైతం చేతికి ఇవ్వడం లేదనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 36గంటలు అవసరమైతే మరికొన్ని గంటలు పని చేయడానికి జూనియర్ డాక్టర్లు ముందుకు వస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే కోల్‌కత్తా దురదృష్ట బాధితురాలు అభయ రాత్రిపూట విశ్రాంతి కోసం అభద్రత కలిగిన సెమినార్ హాలును ఆశ్రయించవలసి వచ్చింది. దుర్మార్గుడి చేతిలో హతమయ్యింది.



మనదేశంలో 2007లోనే మెడికల్ ప్రొటెక్షన్ యాక్ట్ (ఎంపీఏ) ఉంది. 23 రాష్ట్రాలు దాన్ని తమదైన రూపంలో అమలు చేస్తున్నాయి. అయితే ఆ చట్టాన్ని అమలు చేసే విషయంలో ఒక్కొక్క రాష్ట్రం ఒక్కో విధానాన్ని పాటించడం వలన నేరాలు శిక్షలు విషయంలో ఏకరూపత లేకుండా పోయింది.

## జూనియర్ డాక్టర్లపై పని ఒత్తిడి

ఎన్ఎంసీ (జాతీయ మెడికల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో నేషనల్ టాస్క్ ఫోర్స్ ఫర్ మెంటల్ హెల్త్, వెల్ బీయింగ్ దేశవ్యాప్తగా 25,590 మంది ఎంబిబిఎస్, 2,337 మంది పీజీ వైద్యవిద్యార్థులు, 7,035 మంది ఫ్యాకల్టీని ఆన్‌లైన్ సర్వే చేయడం ద్వారా ఒక నివేదికను రూపొందించింది. ఆ నివేదిక ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యకళాశాలల్లో ఎంబిబిఎస్, పీజీ విద్యార్థులతో ఏకధాటిగా రెండు, మూడు రోజులు పనిచేయించడంతో పనిభారం, మానసిక ఒత్తిడికి దారితీస్తోంది. ప్రతి నలుగురు ఎంబిబిఎస్, ఇతర యూజీ కోర్సుల విద్యార్థుల్లో ఒకరు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సర్వేలో వెల్లడైంది. ప్రతి ముగ్గురు పీజీ విద్యార్థుల్లో ఒకరు ఆత్మహత్య ఆలోచనల్లో ఉన్నట్లు వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది. 28శాతం మంది ఎంబిబిఎస్, 15శాతం మంది పీజీ విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. గత ఏడాదికాలంలో 16.2శాతం మంది యూజీ, 31.2శాతం మంది పీజీ విద్యార్థులు తమకు ఆత్మహత్య ఆలోచనలు వచ్చినట్టు తెలిపారు. 287 మంది పీజీ విద్యార్థులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు పేర్కొనడం నివ్వెరపరుస్తోంది. సర్వేలో పాల్గొన్న పీజీ విద్యార్థుల్లో 45 శాతం మంది తాము వారానికి 60 గంటలకు పైగానే పని చేస్తున్నట్టు వెల్లడించారు. 56 శాతం మంది వారాంతపు సెలవు లేకుండా పని చేస్తున్నామని తెలిపారు. 9.7 శాతం మంది యూజీ, 18 శాతం పీజీ విద్యార్థులు ర్యాగింగ్‌కి గురవుతున్నామన్నారు. ఈ గణాంకాలు బట్టి చూస్తే విధి నిర్వహణలో పని వత్తిడి వలన వైద్యులు ప్రత్యేకించి జూనియర్ డాక్టర్స్ ఎదుర్కొనే ఇబ్బందులతో పాటు సాటి సిబ్బంది ద్వారా ఎదురయ్యే లైంగిక వేధింపులు, ఆగంతకులు ద్వారా అత్యాచారాలు, హత్యలు వంటి విష వలయంలో మహిళా వైద్యులు తమ విధులను నిర్వహిస్తున్నారు అనేది వాస్తవం. ఇటువంటి అఘాయిత్యాలు జరిగిన సమయంలో మాత్రం సమాజం చాలా వేగంగా స్పందిస్తుంది. అంతే వేగంగా చల్లారిపోతుంది. నిందితులు మాత్రం దర్జాగా తిరుగుతూ ఉంటారు.

## నిర్భయ చట్టం

పన్నెండేళ్ల క్రితం దేశ రాజధానిలో కదులుతున్న బస్సులో 'నిర్భయ'పై జరిగిన అత్యాచారం దేశ వ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకాయి.

యువత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టింది. ఉద్యమ తీవ్రత చూసిన ప్రభుత్వాలు దీనికి చరమ గీతం పాడే విధంగా కఠిన చట్టాలు రూపకల్పన చేస్తామని హామీ ఇచ్చాయి ఇచ్చి మాట ప్రకారం కీచకులను అణచివేయడానికి ఘనమైన చట్టాలు ఏర్పాటు చేశారు. అయితే ఆ ఘనమైన చట్టాలను నర రూప రాక్షసులు చాలా తేలికగా ఉల్లంఘనలు చేస్తూ చట్టానికి

చిక్కకుండా దర్జాగా తిరుగుతున్నారు. మహిళలపై హింసను నిరోధించేందుకు గత చట్టాలను సవరించి కేంద్ర ప్రభుత్వం 2013లో 'నిర్భయ' చట్టం తీసుకువచ్చింది.
ఈ కేసు విషయంలో జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ సిఫార్సులు చాలావరకూ అమలులోనికి తీసుకువచ్చారు. దేశంలోని అన్ని జిల్లాల్లో అత్యాచార బాధితుల కోసం వన్ స్టాప్ సెంటర్లు, హెల్ప్ లైన్లు ప్రారంభించారు. నిర్భయ ఫండ్ విడుదల చేశారు. నిర్భయ స్క్వాడ్, యాప్ అందుబాటులోకి వచ్చాయి.
2012 ఢిల్లీ హత్యాచార సంఘటనకు సంబంధించి 2017లో దోషులైన వారిలో నలుగురికి మరణశిక్ష పడినా సమాజంలో పరిస్థితులు మారడం లేదు. ఇటువంటి కీచకుల విషయంలో శిక్షలు వేయడం కాదు. నడిబొడ్డున ఎన్‌కౌంటర్లు చేయాలని చాలా మంది అభిప్రాయపడుతూ ఉంటారు. దీనివలన మిగిలినవారు భయపడతారనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అయితే హైదరాబాద్‌లో దిశ అత్యాచారం విషయంలో నిందితులను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చివేశారు.
మానవతావాదులు తప్ప చాలామంది ఆ ఘటనను సమర్థించారు. ఇటువంటి ఘటనలు భయాన్ని పుట్టిస్తాయని అందరూ భ్రమ పడ్డారు. ఈ ఎన్‌కౌంటర్ తరువాత అత్యాచారాలు, హత్యలు మొదలైన వాటిలో ఏ విధమైన తగ్గుదల కనిపించకపోగా గతం కన్నా కేసులు పెరగడం శోచనీయం.
'వో లోగోంకో నహీ చోటో' (వాళ్లను వదలొద్దు).. అత్యంత పాశవిక రాక్షస కాండకు గురై విలవిల్లాడుతూ 'నిర్భయ' ఇచ్చిన వాంగ్మూలమది. ఇప్పుడు కోల్‌కత్తా వైద్యురాలి పైనా అదే తరహా దాడే జరిగింది. కాళ్లూ, చేతులూ విరిగిపోయి, అంతర్గత అవయవాలు ఛిద్రమై ఒళ్లంతా గాయాలతో పోరాడుతూ అభయ దుర్మరణం పాలైంది. కోల్‌కత్తా వైద్యురాలిపై హత్యాచారం ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో మరో దారుణం చోటు చేసుకుంది. డెహ్రాడూన్‌లోని అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్ వద్ద ఆగి వున్న ఢిల్లీ-డెహ్రాడూన్ బస్సులో 15 యేళ్ల బాలికపై ఆరుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. ఉత్తరాఖండ్‌లోనే ఇటీవల ఆసుపత్రి నుండి ఇంటికి తిరిగి వస్తున్న నర్సుపై అత్యాచారం, ఆపై హత్య జరిగింది. ఈ దుర్ఘటనలు మాత్రం ఎక్కడా ఆగడం లేదు. నరరూప రాక్షసులు చట్టాలను శిక్షలను ఏమాత్రం లెక్కచేయడం లేదు. మన దేశంలో చట్టాలు ఆమోదించడానికి యేండ్ల తరబడి పోరాటాలు చేయాలి. కానీ ఉల్లంఘనలకు క్షణాలు చాలు. చట్టాలను ఖాతరు చేసే పనే లేదన్నట్లుగా నేరస్తులు దాడులు, అత్యాచారాలకు తెగబడుతూనే ఉన్నారు.



**మత్తులో నేరాలు**

విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి లభించడం రకరకాల మత్తులో, మానవత్వం లోపించిన మనుషులు పెరిగిపోతున్న తరుణంలో అత్యాచారాలు, హత్యలు కూడా పెరిగిపోతున్నాయి.

## మాధ్యమాల ప్రభావం

చలనచిత్రాలు, శ్రవణ మాధ్యమాలు, స్త్రీ అంగాంగ ప్రదర్శన, వర్ణనలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. చలనచిత్ర, దృశ్య మాధ్యమాలు, స్త్రీని వ్యక్తిత్వం ఉన్న మనిషిగా కాకుండా శృంగార వస్తువుగా చిత్రీకరిస్తున్నారు. వీటిని కట్టడి చేయకపోవడం వల్లే ఈ విపరిణామాలు సంభవిస్తున్నాయని అనడంలో ఎటువంటి సందేహం లేదు.

## పోర్నోగ్రఫీ(అశ్లీల చిత్రాలు, అశ్లీల దృశ్యాలు)

నేటి మహిళలపై జరుగుతున్న అత్యాచారాలలో అధిక ప్రభావం చూపే అంశాలలో పోర్న్ కల్చర్ ఒకటిగా చెప్పవచ్చు.
నియంత్రణ లేని అశ్లీల సాహిత్యం, అసభ్యకర దృశ్యాలు నేడు మొబైల్స్, ల్యాప్‌టాప్, కంప్యూటర్‌లలో దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ చాలా సులభంగా లభిస్తుండటం వల్ల యువత మనసులను కలుషితం చేయడమే కాదు స్త్రీలపై లైంగిక దాడులకు, అత్యాచారాలకు పాల్పడేలా పురిగొల్పుతున్నట్లు అనేక కేసుల్లో వెల్లడైంది. కోల్‌కత్తాలో అభయపై దాడి చేసిన నిందితుడు కూడా అత్యాచార ఘటనకు ముందు మద్యం తాగి ఉన్నాడనీ, అతని మొబైల్ దాదాపుగా హింసాత్మక పోర్న్ వీడియోలతో నిండి వున్నట్లు విచారణలో తేలింది.

**ఆడపిల్లలపై ఆంక్షలు**

కుటుంబం, సమాజం ఆడపిల్లల మీద ఆంక్షలు పెడుతూ, వారిని నిరంతరం అదుపులో పెడుతూ వాళ్ల ఎదుగుదలను కుదించి వేస్తుంది. వాళ్ల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం మీద దెబ్బ కొడుతోంది. ఫలితంగా తాము అన్నింటా తక్కువే, తమకు అసలు విలువ లేదనే ఆత్మన్యూనతతో పెరుగుతున్నారు. తమ మీద హింస తప్పదు. మౌనంగా భరించాలి. ఎదురు తిరగకూడదు అన్న పితృస్వామిక భావజాలం నరనరానా నూరిపోయడం వల్ల అమ్మాయిలు ఇంటా బయటా హింసకు బలవుతున్నారు.

## మహిళలపై వ్యాఖ్యానాలు

మహిళలపై దాడులు జరిగినప్పుడు పలువురు రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. రాత్రిళ్లు మహిళలు బయటకు రాకూడదని, మహిళల వస్త్రధారణ మారాలనీ... ఇలా అనేక రకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. స్త్రీలు బయటకు రావడం వల్లే అత్యాచారాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. కోల్‌కత్తా జూనియర్ వైద్యురాలు అభయ విషయంలో కూడా ఆ సమయంలో ఆమె సెమినార్ హాల్‌కు వెళ్లవలసిన అవసరం ఏముంది? అనే ప్రశ్నలు అనేకం వచ్చాయి. ఈ ప్రశ్నలు వేసే వారందరూ మహిళలపై దాడులు జరగడానికి ప్రధాన కారణం ఉన్మాదం అనే విషయాన్ని పక్కన పెడుతున్నారు.
మహిళల రక్షణ కోసం సలహాలు ఇవ్వడం తప్పు కాదు. అదే సమయంలో దాడులకు కారణాలు చూడకుండా మహిళలను

తప్పు పట్టడం కూడా సరికాదు. అత్యాచార బాధితుల పట్ల సమాజంలో ఉండే భావన వల్ల కూడా పలు సందర్భాల్లో దాడులు, హింసకు గురైనవారు బయటకు వచ్చి కేసులు పెట్టలేకపోతున్నారు. బాధితుల పట్ల కేవలం సానుభూతి చూపడం కాకుండా, గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు, పరిస్థితులను వారికి కల్పించాలి. ఇదే రీతిలో పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోన్న తరుణంలో అస్సాం సిల్చార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ జారీ చేసిన(మెమో) సూచనల చిట్టా అనేక విమర్శలకు దారితీసింది.



ఇటువంటి క్లిష్ట సమయంలో మహిళా వైద్యులకు పటిష్టమైన భద్రత కల్పిస్తాం. సౌకర్యవంతమైన విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తాం. మీకు పూర్తి రక్షణగా మేమున్నాం అనే భరోసా ఇవ్వడానికి బదులుగా–

"ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా వుండాలంటే ముందు మీరు జాగ్రత్తలు పాటించండి" అంటూ ఉచిత సలహాలు అస్సాం సిల్చార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఇవ్వడం జరిగింది. ఆ సూచనల ప్రకారం "మహిళా వైద్యులు, విద్యార్థినులు, సిబ్బంది నిర్మానుష్య ప్రాంతాలు, వెలుతురు తక్కువగా, జనాలు లేని ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఒంటరిగా ఉండకుండా చూసుకోండి. అత్యంత అవసరమైతే తప్ప రాత్రి సమయాల్లో వసతి గృహాలను విడిచి వెళ్లొద్దు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే అధికారులకు సమాచారం ఇవ్వండి. తెలియని, అనుమానాస్పద వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. విధుల్లో ఉన్నప్పుడు చుట్టుపక్కల పరిస్థితులపై ఓ కన్నేసి ఉంచండి. మర్యాదపూర్వక సంభాషణ సాగించండి. వీటివల్ల అనైతికంగా వ్యవహరించే వ్యక్తుల దృష్టిలో పడకుండా ఉండొచ్చు. ఏదైనా వేధింపుల సమస్య ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి" అని ఆ అడ్వైజరీలో సూచించారు. మహిళా సిబ్బంది ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే దీనిని జారీ చేసినట్లు తెలిపింది.

అయితే దీనిపై విద్యార్థుల నుంచి, సామాజిక మాధ్యమాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమను గదులకే పరిమితం కావాలని చెప్పే బదులు భద్రతా ఏర్పాట్లు మెరుగు పర్చాలన్నారు. క్యాంపస్‌లో లైటింగ్ పెంచాలనీ, మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జూనియర్ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. వెంటనే ఆ సర్క్యులర్‌ని వెనక్కి తీసుకోవాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలనీ, లేకపోతే తాము నిరసన చేపడతామని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే యజమాన్యం యూటర్న్ తీసుకుంది. అడ్వైజరీని ఉపసంహరించుకుంది.

**ముగింపు:** రోగులకు ప్రాణదాతలై రాత్రీ, పగలూ లేకుండా శ్రమించే వైద్యులకు జీతభత్యాలే కాదు మెరుగైన పని పరిస్థితులు కల్పించడం కనీస బాధ్యత. ఆరోగ్య రంగానికి నిధుల పెంపుతో పాటు 'అభయ' లాంటివారు 36 గంటలు నిర్విరామంగా పని చేయాల్సిన అవస్థ తప్పించేలా తగినంత మంది వైద్య సిబ్బందిని తీసుకోవాలి. ప్రభుత్వాలు, వైద్య సంస్థలు సమష్టిగా దీని మీద దృష్టి పెట్టాలి. సుప్రీమ్ చెప్పినట్టు ఆస్పత్రుల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం(పోష్) వర్తిస్తుందని గుర్తించాలి. ఇవాళ్టికి జూనియర్ డాక్టర్ల అమానవీయ పరిస్థితుల్లో పని చేయాల్సి వస్తున్న తీరును గుర్తించి, ముందు అక్కడి నుంచే మార్పు మొదలు పెట్టాలి. మహిళా సాధికారత వాస్తవంలో అమలు కావాలి అంటే ఆర్థిక కార్యకలాపాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలి. ఇది అమలవ్వాలంటే మహిళలు పని చేసే ప్రదేశాలలో సంపూర్ణ రక్షణ కల్పించాలి. ఈ రక్షణ లేకపోవడం వల్లనే కొందరు తమ ఉద్యోగాలను వదిలేసి వెళ్లిపోతున్నారు.

సమాజంలో మార్పు అనేది చట్టాలు రూపకల్పన ద్వారానే జరిగిపోదు. మహిళలపై అత్యాచారాలను చట్టాలు ఏర్పాటు ద్వారా అరికట్టగలం అనేది పలు సందర్భాలలో విఫలం కావడం మనం చూస్తున్నాం. మహిళలను రాచి రంపాన పెట్టే పురుషాధిక్య ధోరణులకు ముగింపు పలకడం కేవలం చట్టాల ద్వారానే సాధ్యపడదు. స్త్రీ, పురుష సమానత్వంపై సామాజిక చైతన్యాన్ని పెంచాలి. ఆ మేరకు పాఠశాల స్థాయి నుంచే నైతిక విద్యను బోధించాలి. ఇప్పుడు తాజాగా కోల్‌కత్తా సంఘటనలో కూడా కొత్త చట్టాల రూపకల్పనకు ప్రయత్నాలు చేయడం అనేది వృథా ప్రయాసే అవుతుంది.

ఎన్ని చట్టాలు వచ్చినా సమాజం లో మార్పు వస్తేనే మహిళలపై దాడులు, అత్యాచారాలు ఆగుతాయి తప్ప చట్టాల ద్వారా సమాజం మారదు. కానీ సమాజంలో అభ్యుదయ మార్పులు జరగాలంటే చట్టాలు కావాలి. అందుకు అనుగుణంగా ప్రభుత్వం, ప్రజలు మారాలి. చట్టాన్ని సరిగా అమలు చేసే యంత్రాంగం, చట్టం స్ఫూర్తిగా నడిచే అధికారులు ఉండాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం కలిసికట్టుగా కృషి చేసిననాడే దాడులు, అత్యాచారాలు, హత్యల నుండి మహిళలు విముక్తులవుతారు. ■





# పంటల్ని కాపాడుతుంది

మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన అయాన్ బాగా చదువుకుని విదేశాల్లో స్థిరపడాలి అనుకున్నాడు. కొత్తగా వస్తున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ఏఐతో నడిచే రోబోలను రూపొందించే సంస్థలో ఉద్యోగం సాధించాడు. మంచి జీతం, విలాసవంతమైన జీవితం..చాలనుకున్న అయాన్ కొన్నేళ్ల క్రితం స్నేహితుడి పెళ్లికని మహారాష్ట్రలోని లాతూర్ వెళ్లాడు. అప్పటి వరకూ నగర జీవితం తప్ప పల్లె ప్రాంతం రైతుల జీవనవిధానం తెలియని అయాన్ గమ్యాన్నే మార్చేశాయి అక్కడి పరిస్థితులు. చెరకు, మొక్కజొన్న తదితర పంటలతో పాటు, కాయగూరలూ, పండ్ల తోటలూ సాగు చేసే ఆ గ్రామం అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉండటం అడవి జంతువులు పంటలపైన దాడి చేస్తుండటంతో దాదాపు 30శాతం దిగుబడి తగ్గి నష్టాలొచ్చేవి. ఈ క్రమంలో షాక్ ఇచ్చేలా విద్యుత్ తీగల ఫెన్సింగ్ ఏర్పాటుచేయడం, బాణాసంచా పేల్చడం, తుపాకులతో కాల్చడం తదితర ప్రయత్నాలలో జంతువుల్ని తరిమేసేవారు రైతులు. రాత్రిపూట ఇలా పంటల్ని కాపాడుకునే క్రమంలో జంతువుల ఎదురుదాడిలో ఎంతోమంది గాయపడేవారు. మరికొందరు ప్రాణాలు కోల్పోయేవారు. కొన్నిసార్లు పాముకాట్లకూ గురయ్యేవారు. మరోవైపు జంతువులకీ హాని జరిగేది. ఈ పరిస్థితుల్నీ దగ్గరగా చూసిన అయాన్ అటు రైతులకీ, ఇటు మూగజీవులకీ ప్రమాదం కలగకుండా ఏదైనా చేయాలనుకున్నాడు. అందుకే ఉద్యోగం మానేసి పల్లెబాట పట్టాడు. దాదాపు ఏడాదిపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అసోం, కేరళ తదితర ప్రాంతాల్లోని రైతుల్ని కలిసి వారి అనుభవాల్ని దగ్గరగా చూశాడు. వ్యవసాయం పట్ల అవగాహన పెంచుకున్నాడు. ఏనుగులూ, చిరుత పులులూ వంటివి అటవీ ప్రాంతాలకు దగ్గర్లో ఉన్న గ్రామాలమీద పడి పెంపుడు జంతువులపైనా, జనాలపైనా దాడి చేయడం గమనించాడు.

## సోలార్‌తో నడిచేలా

అయాన్ తన అధ్యయనంలో భాగంగా జంతువులు వెలుతురుకీ, శబ్దాలకీ భయపడి వెనక్కి వెళ్లడం గమనించాడు. ఈ రెండింటి ఆధారంగానే ఏదైనా యంత్రాన్ని కనిపెట్టాలని భావించిన అయాన్ 2018లో ప్రయోగం మొదలుపెట్టాడు. మరోవైపు రైతులకు నిర్వహణ భారం లేకుండా, తేలిగ్గా ఉపయోగించుకునే వీలున్న పరికరాన్ని రూపొందించాలనుకున్నాడు. అవుట్‌డోర్ లైట్ మాదిరి ఉండే ఈ యంత్రానికి నాలుగువైపులా 6 వాట్స్ సామర్థ్యంతో రకరకాల రంగుల్లో వెలిగే ఎల్ఈడీ లైట్లు అమర్చాడు. దాదాపు అర కిలోమీటరు దూరం కాంతులు ప్రసరించే కాటిధాన్ కోసం ప్రత్యేకంగా విద్యుత్ అవసరం లేకుండా సోలార్ కరెంటుతో నడిచేలా ఏర్పాట్లు చేశాడు. అంతేకాదు, పని కట్టుకుని వెళ్లి పొలంలో కాటిధాన్‌ను ఆన్ చేసే పని లేకుండా చీకటి పడగానే దానంతట అది వెలిగి వెలుతురు రాగానే లైట్లు ఆగిపోయేలా సెన్సర్లను అమర్చాడు. రాత్రిపూట వచ్చే జంతువుల్ని భయపెట్టడానికి వెలుగుల యంత్రం బాగానే ఉంది. మరి జొన్న, కంది వంటి పంటల్నీ, కూరగాయల్నీ, పండ్ల తోటల్నీ, కోతులూ, రకరకాల పక్షుల నుంచీ కాపాడటం ఎలా అంటారా..అందుకోసం 'కపికాట్' పేరుతో మరో యంత్రాన్ని తీసుకొచ్చాడు అయాన్. ఏఐ సాయంతో చిన్న అలికిడిని సైతం గుర్తించి, వెంటనే జంతువుల అరుపులతో వింతైన శబ్దాలు చేసే ఈ పరికరం కోతుల్నీ, కొండముచ్చుల్నీ, పంటలపైన వాలిన పక్షుల్నీ బెదరగొడుతుంది. మూడేళ్ల క్రితం అందుబాటులోకి తెచ్చిన ఈ యంత్రాలను కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, అసోం, గుజరాత్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో పదివేల మంది రైతులు ఉపయోగిస్తున్నారు. వన్యప్రాణుల్ని తరిమేస్తూ పంటల్నీ, పెంపుడు జంతువుల్నీ కాపాడుకుంటున్నారు.

మరోవైపు వన్యప్రాణుల్ని సంరక్షించే అటవీశాఖ సిబ్బంది సైతం గస్తీ సమయంలో టార్చిలైట్ మాదిరి పని చేసే కాటిధాన్‌ను తమతోపాటే తీసుకెళ్లి వన్యప్రాణుల నుంచి తమని తాము కాపాడుకుంటున్నారు. అడవుల దరిదాపుల్లో ఉండేవారికీ ఈ యంత్రాలను అందిస్తోంది ప్రభుత్వం.

అన్నదాతల కోసం ఆవిష్కరించిన ఈ పరికరాలను కొనుగోలు చేయడం రైతులకు భారమవుతుందని భావించిన అయాన్ సీఎస్ఆర్‌లో భాగంగా కార్పొరేట్ సంస్థల నుంచి ఇప్పించే ఏర్పాటు చేస్తున్నాడు.



ఈవారం కవిత్వం

# మొక్కల మొక్కులు తీర్చవా!



**కలిసి** మెలిసి ఉన్నాయి ఐక్యంగా ఉన్నాయి
హాయిగా మాట్లాడుకుంటున్నాయి
గ్రీటింగ్స్ చెప్పుకుంటున్నాయి
తోట సంతోషంతో పండగ వాతావరణంలా ఉంది
కొన్ని మొక్కలు మౌనంగా
కొన్ని మొక్కలు పరధ్యానంగా
శూన్యంలోకి చూస్తున్నాయి నిస్సత్తువలో
నిలబడ్డాయి
వనమాలి తప్పు లేదు/
రక్షకుడుగా నీళ్ల
పెడుతున్నాడు
పురుగుల మందు చల్లుతున్నాడు
అటూ ఇటూ వెలసిన
బిలాల్ని కంతల్ని బాధ్యతగా పూడుస్తున్నాడు
పశువుల నుండి కాపాడుతున్నాడు
కుట్ర ప్రకృతిది
ఆ మొక్కల పరిధిలో ఆ మొక్కల పునాదిలో
రాళ్ల ఉనికి/ సమాజమేమో
అవి బేషరం తీగలని గొడ్రాళ్ల తెగలని
కాతల్ని పూతల్ని ఇవ్వవని నిందేస్తూ
ప్రభూ! జీవన ప్రమాణంలో సుఖదుఃఖాలు సరే
ఆ మొక్కల మొక్కులు తీర్చవా
లోకం సన్నాయి నొక్కులు ఆపవా!

– కోటం చంద్రశేఖర్

# వీరనారి!



చెమట సముద్రంలో
నల్లటి నారి
కాయకష్టంతో
కాయదేరిన కాయం
వీపు సింహాసనంపై
పసివాడు!
స్వేదంతో సేద తీరుస్తూ
పేగుబంధాన్ని
కొంగుబంధంతో
ముడివేసుకొని
అంగరక్షకురాలై
బతుకుయుద్ధం చేస్తుంది
నాడు స్వేచ్ఛకోసం
వీపున బిడ్డతో
పోరాడిన లక్ష్మీబాయి వీరనారయితే!
నేడు ఆకలి కోసం వీపున బిడ్డతో
స్వేదం చిందించే ఈమె కూడా వీరనారే!
అది ఆఖరి యుద్ధం.. ఇది ఆకలి యుద్ధం
ఎక్కడ పోరాటం వుంటే అక్కడ
ఓ లక్ష్మీబాయి ఉంటుంది/ ఓ రుద్రమదేవి ఉంటుంది
ఓ మాంచాల ఉంటుంది
బతుకుపోరాటంలో ప్రతి వనిత
వెనకడుగు వేయని మన చరిత
నిస్వార్థపూరిత త్యాగశీలత!

– భీమవరపు పురుషోత్తమ్

# నిశీధి హృదయం

**నిశీధి** నిందించెనే
ప్రతిరోజు కన్నీటితో తడిపేస్తున్నానని
దానికేం తెలుసు
తన ఆలోచనల ముసురే అలా బయటకొస్తోందని..

కన్నులు నిందించెనే
తన రూపాన్ని
చూడకుండా చేసానని
వాటికేం తెలుసు
అవి చూసే దూరం కన్నా
మనసు వెతికిన దూరం
ఎక్కువని..



అక్షరాలు నిందించెనే
నా రాతల్లో తన జాడ
కనబడుట లేదని
వాటికేం తెలుసు
వాటి పుట్టుకే తన
అనుభవాలని..

జ్ఞాపకాలు నిందించెనే
కాలంతో పాటు మరిచిపోతానేమోనని
వాటికేం తెలుసు
కడలి ముత్యాన్ని దాచినట్టు నాలో తనని దాచుకున్నానని..

– రమేష్ మాంద్ర

# పుస్తక సమీక్ష

## 'పడాల'వారి జీవితసార సంగ్రామం



సారస్వత చరిత్రలో నిలిచిపోయే పలు నాటకాలు, కథలు, నవలలు, కవితలు, బుర్రకథలు, డిటెక్టివ్ నవలలు, ఇతిహాస ప్రబంధకావ్యాల తెలుగు సేత క్రైస్తవ ఇతివృత్త గ్రంధాలు బాల సాహిత్యం యాత్రాగ్రంథాలు వామపక్షపార్టీల గ్రంధాలు ఇంతేకాకుండా కమ్యూనిస్టు పార్టీ నిర్వహణ వంటి పలు ప్రశంసనీయమైన పనులు నిర్వహించిన పడాల రామారావు 1922లో రాజమండ్రిలో జన్మిం చారు. స్వాతంత్ర్యసాధనకై నాటి బ్రిటీష్‌వారితో పోరాటం సలిపారు. నిరుపేద చేనేత కార్మిక కుటుంబంలో జన్మించిన వీరి బాల్యం కష్టాలమయం. ఆరవతరగతి చదువుమధ్యలోనే ఆపినా, వీరి జ్ఞాన సముపార్జన జీవితాంతమూ కొనసాగింది. ఇట్టి మహనీయుడు చరిత్రను వారి కుమారుడు పడాల వీరభద్రరావు డా॥పెనుమాకుల భాస్కరరావు చేత రాయించి అందిస్తోన్న అపూర్వగ్రంథం ఇది. సరళమైన భాషలో భాస్కరరావు, రామారావు జీవితంలో ప్రతి ఘట్టాన్నీ కన్నులకు కట్టినట్లు పొందుపరిచారు. నాటి నిబద్ధత, దేశంపై ప్రేమతో సర్వసంగ పరిత్యాగానికి కూడా వెరవకుండుట, సమయోచితమైన ఆలోచనలు, సేవాతత్పరత, రచనాస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం. ప్రతి ఒక్కరు చదివి, సారాన్ని ఒంటపట్టించు కుని, సమాజానికి ఎలా ఉపయోగపడవచ్చునో తెలుపుతుంది గ్రంథం. రచయితకు ప్రచురణకర్తకు అభినందనలు.

**(పడాల రామారావు జీవితం- సాహిత్యం, రచన: డా॥పెనుమాకుల భాస్కరరావు, వెల: రూ 100, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)** – కూర చిదంబరం

## 'మాటల చెట్టు'కు పూసిన కవన పుష్పాలు



'నానీ లోచనాలు'తో కవనలోకంలోకి అడుగిడిన వర్ధ మాన కవయిత్రి గడ్డం సులోచన తన 'మాటల చెట్టు' కి పూసిన 45 కవన పుష్పాలతో మన ముందు కొచ్చారు. 'శ్రమ జీవుల చెమటల్లో/ పరిమళించేది మట్టివాసనే/ గుండెలనిండా మట్టివాసన పీల్చుకుంటే/ ఎంత ఊరట..'అన్న పాదాల్లో సులోచన మంచి కవిత్వం రాయగలదన్న నమ్మకం కలుగుతోంది. ఎన్ని సిరిసంపదలున్నా సరైన ఆరోగ్యం కరువైతే ఏమి లాభమని ప్రశ్నిస్తున్నారు కవయిత్రి. విద్యాధనం, సౌభాగ్య సంపద, ధనలక్ష్మి కటాక్షం, స్నేహసౌరభం, హోదా, డాబూ, దర్పం, డబ్బు 'ఎన్నున్నా ఏమైనా/ ఆరోగ్యభాగ్యం లేకుంటే/ ఉన్నదేమి నాకు?' అని నిలదీస్తున్నారు. కాళోజీ, గుడుగు రామ్మూర్తి పంతులు ప్రభృతులకు అక్షర నీరాజనం సమ ర్పిస్తారు. 'నేను సైతం', 'నా దేశం, నా జెండా' వంటి దేశభక్తి కవితలు వినిపిస్తారు. 'కన్నయ్య, సమాధానం, నీలోకి నన్ను చూడని' మొదలగు కవితలు సులోచనలోని భావపటిమను పట్టి యిస్తాయి. 'స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ విముక్తి' వస్తువులుగా కవితలనల్లారు. 'నువ్వు రాసేది కవిత్వం కాదేమో' అని పెదవి విరిచిన భర్త విమర్శ ను సహృదయంతో స్వీకరించి పట్టుదలతో తనను తాను సానపెట్టు కుని ఓ సంపుటి వెలువరించే స్థాయికి ఎదగడం.. స్వయానా ఆమె శ్రీవారు పుస్తక ప్రచురణకు పూనుకోవడం అభినందనీయం. మరింత మంచి కవిత్వంతో మున్ముందు సులోచన పాఠకులను అలరిస్తా రని నా నమ్మకం. **(మాటల చెట్టు, రచన: గడ్డం సులోచన, వెల:రూ 120, ప్రతులకు: నవతెలంగాణ పబ్లికేషన్స్, హైదరాబాద్)** – రమణ వెలమకన్ని

## తెలంగాణ సామాజిక ముఖచిత్రం

ఫోకస్ ఇండియా ప్రచురణ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆర్థికవృద్ధి, సామాజిక పురోగతి, ఆవశ్యక సేవలు, కీలక ఆర్థిక సూచికలను వివరిస్తూ, వివిధరంగాలలో తెలంగాణ రాష్ట్రం ఎలా అభివృద్ధి సాధిస్తోందో ప్రత్యేకంగా విద్యార్థులను, యువ తను దృష్టిలో పెట్టుకొని, తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం 2024 వెలువరించింది. తెలంగాణ ప్రాంత విద్యార్థులకు ముఖ్యంగా



తెలుగు మాధ్యమంగా పోటీపరీక్షలకు సన్నాహాంలో వున్న యువతకు ఈ ముఖచిత్రం ఎంతైనా ప్రయోజనక రంగా తీర్చిదిద్దబడింది. టి.జి. పి.ఎస్. సి గ్రూప్ 1,2, 3,4 ఇతర పోటీపరీక్షలకు ఈ గ్రంథం కరదీపికగా ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్రగ్రాంథాలయ ఛైర్మన్, డా॥ రియాజ్ తెలంగాణ ప్రాంత ఆర్థిక అంశాలను, ప్రభుత్వం డేటా ఆధా రంగా ఈ ముఖచిత్ర గ్రంధాన్ని రూపొందించినట్టుగా ముందు మాట లో వివరించారు. పోటీపరీక్షల నిపుణులైన డా॥రియాజ్,యితర సోషి యాలజీ, ఎకానమీ, జాగ్రఫీ, పాలనా వ్యవహారాలు బృంద పర్య వేక్షణలో వెలువడిన ఈ గ్రంథం నిస్సందేహాంగా టి.జి.పి.ఎస్.సి. గ్రూప్‌లు యితర పరీక్షల యువతకు ఉపకరించే గ్రంధంగా ఆర్థిక వ్యవస్థ, పాలన ఆరువిభాగాలుగా సంబంధిత ప్రామాణిక గణాంకాల నివేదికలు, డాక్యుమెంట్‌లు, పట్టికల చిత్రాలతో సమగ్రంగా రూపొం దించబడింది. **(ఫోకస్ ఇండియా, తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖ చిత్రం 2024, వెల: రూ 429, ప్రతులకు: ఇమామ్ డైరక్టర్, ఫోకస్ ఇండియా పబ్లికేషన్స్, అశోక్‌నగర్, హైదరాబాద్)** – యర్రమిల్లి

## భక్తులను అలరించే స్వామివారి సన్నిధి

డా॥గంగిశెట్టి శివకుమార్, ఈతకోటి సుబ్బారావు ఈ పుస్త కానికి చక్కటి విలువైన ముందుమాటలు రాసారు. జమీన్ రైతు పత్రికల్లోని వార్తలతో నెల్లూరు పట్టణానికి కూతవేటు దూరంలో కనుపర్తిపాడు గ్రామంలో వెలసియున్న శ్రీనాగేంద్ర



సహిత శ్రీవల్లీదేవ సేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరు ని ఆలయంలోని విశిష్టతలు శ్రీఏకాంబరం శేషయ్య (దర్జీ) ద్వారా ఆలయనిర్మాణం తరువాత గుడి విస్తరణ అంశాలు రాసారు. తమిళనాడులో మురుగసభ నానుడి ఆరునివాసాలు. చక్కటి ఫోటోల్తో ముద్రణ చేసారు. కృష్ణాజిల్లాలో కూడా వల్లి దేవసేన సహిత (మోపిదేవి) సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వుంది. మంచినీటి చేదుడుబావి, స్వామివారి వాహనాలు (ఫోటోలు) సుబ్రహ్మణ్యషష్టి ప్రత్యేకత, వాల్మీకి రామాయణంలో కుమార సంభవ వృత్తాంత విశేషాలు రాముడికి విశ్వామిత్రుడు వివరించే ఘట్టాలు అద్భుత కథనంతో రాసారు. దాదాపు 30 మంది భక్తుల స్వీయ అనుభవాలు ఈ పుస్తకంలో ప్రత్యేకంగా ముద్రిం చారు. భక్తుల అనుభవాల తో పాటు శ్లోకాలు, స్తోత్రాలు, సనాతన భారతీయ ధర్మంలో షణ్మతాలు ఈ పుస్తకంలో పొందు పరిచారు. సంకలన కర్త రామకృష్ణ దంపూరు ప్రయత్నం అభినంద నీయం. **(శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధి, సంకలనకర్త: డి. రామకృష్ణ, వెల: అమూల్యం, ప్రతులకు: డి.పద్మావతి, 26-14- 1142, కొండాయపాళెంరోడ్డు, నెల్లూరు)** – తంగిరాల చక్రవర్తి

షేక్ అబ్దుల్ హకీం జాని

# పాములు కనపడని దేశాలు

ప్రపంచంలో అనేక దేశాలను గమనిస్తే వింత విశేషాలు కానవస్తాయి. కొన్ని దేశాలలో పాములు కనపడవు అంటే ఆశ్చర్యం కలగకమానదు. పాముకాటుకు గురై ప్రతి ఏటా లక్షలమంది ప్రాణాలు కోల్పోతున్నారు. పల్లెలు, పట్నాలు, నగరాలు అనే తేడా లేకుండా పలు ప్రాంతాలలో పాముల సంచారం ఉంటుంది. కానీ కొన్ని దేశాలలో పాములు కనపడవు అంటే వినటానికి ఆశ్చర్యంగా ఉంటుంది. దీని వెనుక చాలా ఆసక్తికర కారణాలున్నాయంటున్నారు శాస్త్రవేత్తలు. ప్రపంచంలో పలు ప్రాంతాల్లో ఒక్క పాము అంటే ఒక్క పాము కూడా లేని ప్రదేశాలు ఉన్నాయని ఆ దేశాల పత్రికలలో రాయడం అనేకమంది చదివే ఉంటారు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది రకాల పాములున్నాయి. వీటిలో



విషపూరితమైనవి కొన్నే ఉన్నాయి. త్రాచుపాము, కింగ్ కోబ్రా, రక్తపింజర వంటి కొన్ని రకాల విషపూరితమైన పాముల కాటుకు గురైతే మనిషి ప్రాణాలు కోల్పోతాడు. ఆ కొన్నింటివల్లే ప్రతీ ఏటా లక్షలమంది ప్రాణాలు కోల్పోతున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. కొన్ని దేశాలలో పాములు అధికంగా కనిపిస్తుంటే, మరికొన్ని దేశాల్లో అసలు పాము జాడ కూడా తెలియదు. కొన్ని దేశాలలో మంచుపై నీరు పాము ఆకారంలో మెలికలు తిరిగి ప్రవహిస్తుంది. మరి కొన్నిచోట్ల నీటిలో కలసిన ఇసుక మెలికలు తిరిగి ప్రవహిస్తూ పాము ఆకారంలో కనిపిస్తుంది. మరి కొన్ని దేశాలలో మంచు కరెంటు స్తంభాలకు చుట్టుకున్న పాములా భ్రమ కలిగిస్తుంది. వీటిని సాండ్ స్నేక్, స్నో స్నేక్ అని పిలుచుకుంటారు. అయితే ఇవి నిజంగా పాములు కాదు.



బ్రెజిల్‌లో ప్రపంచంలో మరెక్కడా లేనన్ని పాములు ఉన్నాయి. నివేదికల ప్రకారం బ్రెజిల్‌లో 400 కంటే ఎక్కువ జాతుల పాములు కనిపిస్తాయి. బ్రెజిల్‌లో అత్యంత విషపూరితమైన పాములు ఉన్నాయి. బ్రెజిలియన్ అనకొండ పేరుగల అతిపెద్ద పాము కూడా ఇక్కడ కనిపిస్తుంది. అసలు పాములే లేని దేశాలు ఉన్నాయంటే నిజంగా ఆశ్చర్యం కలుగుతుంది. కొన్ని దేశాలలో పాములు కనపడని కారణంగా వాటిని పెంచుకోవాలని ఆసక్తి కనబరచే ప్రజలు ఉన్నారు. అటువంటప్పుడు అక్కడి అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. పాములు లేని దేశాలు, కనపడని దేశాల వివరాల్లోకి వెళితే అనేక ఆసక్తికరమైన అంశాలు మనం తెలుసుకోవచ్చు.

## ప్రపంచంలో పాములు కనపడని దేశాలు

పర్యావరణ వ్యవస్థలో సమతుల్యతకు పాములు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. పాములు పరాన్నజీవులు. ఇతర జీవులను తిని జీవిస్తాయి. ఎలుకలు, కప్పలు రైతులకు సమస్యను కలిగిస్తుంటాయి. వాటిని పాములు తింటాయి. మన గ్రహం మీద కనిపించే ప్రమాదకరమైన వాటిలో పాములు కూడా ఒకటి. వర్షాలు ఎక్కువగా కురిసే ప్రదేశాల నుంచి ఎడారుల వరకు పాములు మనకు కనిపిస్తూ ఉంటాయి. అయితే భూమిపై న్యూజిలాండ్ దేశంలో పాములు ఉండవు.

## న్యూజిలాండ్

ప్రపంచంలో పాములు లేని దేశాలలో ప్రముఖమైనది న్యూజిలాండ్. న్యూజిలాండ్ దేశం పామురహిత దేశంగా ప్రకటించుకుంది. ప్రపంచంలో ఈ విధంగా ప్రకటించిన మొదటి దేశం ఇదే. న్యూజిలాండ్ అనేది పసిఫిక్ మహాసముద్రంలో నైరుతి మూలన ఉన్న ఒక ద్వీపం. ఈ ద్వీప దేశం అనేక అడవి జంతువులకు నిలయం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇప్పటివరకు ఇక్కడ ఒక్క పాము కూడా కనుగొనబడలేదని పరిశీలకులు చెబుతున్నారు. ఇక్కడ పాములు లేకపోవటానికి కారణం సముద్రాలను దాటి ఇక్కడికి పాములు చేరుకోలేకపోవటమేనంటారు. కొందరు పరిశీలకుల అభిప్రాయం ప్రకారం న్యూజిలాండ్ చుట్టు నీటిలో కొన్ని రకాల పాములు కనిపిస్తాయని తెలుస్తుంది. 'ఎల్లో లిప్డ్ సీ క్రైట్', 'ఎల్లో-బెల్లీడ్ సీ స్నేక్' వంటి పాములు న్యూజిలాండ్ చుట్టు ఉండే నీటిలో చాలా అరుదుగా కనిపిస్తాయని, కాని నీరు చల్లదనానికి అవి వెంటనే తిరిగి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతాయని అందుకే ఆ



దేశ భూభాగంలోకి వెళ్లలేవని, అక్కడ నివసించవని తెలుస్తుంది. కాగా న్యూజిల్యాండ్‌లో పాములపై పూర్తి నిషేధం ఉంది. అంటే పాములను పెంపుడు జంతువులుగా ఉంచుకోకూడదు. అలాగే జూలో ఉంచకూడదు. దక్షిణ ధృవానికి సమీపంలో ఉన్నఈ దేశంలో పాములు ఉండవు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే దేశం భూభాగం చుట్టూ పాములు కనిపిస్తాయి. ఈ దేశం చుట్టూ సముద్రం ఉంటుంది. కానీ దేశంలో ఎక్కడా పాము కనిపించదు. ఆశ్చర్యకరమైన మరో విషయం ఏమిటంటే ఈ దేశంలోని జంతుప్రదర్శన శాలలో కూడా మీరు పాములను చూడలేరు. పాములను ఉంచడం, విదేశాల నుంచి పాములను తీసుకురావడం కూడా ఇక్కడ నిషేధం. న్యూజిల్యాండ్‌లో ప్రతి జంతువు, పక్షులను రక్షణ కోసం చర్యలు తీసుకుంటారు. జంతువుల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయి.



## అంటార్కిటికా

అంటార్కిటికా ఖండంలో పాములు ఉండవు. ఎందుకంటే ఇక్కడ అంతా మంచు. అతిశీతల వాతావరణంలో పాములు జీవించడం కష్టం. మంచు ఖండం అయినా అంటార్కిటికాలో నీళ్ల గడ్డకట్టుకుపోయి మంచు కొండలే ఏర్పడుతుంటాయి. ఇటువంటి వాతావరణంలో పాములు జీవించలేవు. అందుకే ఇక్కడ పాముల మనుగడ ఉండదు. ఎన్నో అరుదైన వన్యప్రాణులకు అంటార్కిటికా అనువైనదిగా ఉంది. సీల్స్, పెంగ్విన్లు, ఓర్కాస్, బ్లూవేల్స్, ధృవపు ఎలుగుబంట్లు వంటి అరుదైన జీవులకు అంటార్కిటికా ఆవాసంగా ఉంది. కానీ ఈ మంచుఖండంలో పాములు మాత్రం ఉండవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## గ్రీన్‌లాండ్

అంటార్కిటికా ఖండంలో వలే గ్రీన్‌లాండ్‌లో కూడా పాములు కనపడవు. ఈ దేశంలోని వాతావరణం పాము జాతులకు సహజ నివాసం లేదు. గ్రీన్‌లాండ్‌లో కూడా న్యూజిల్యాండ్ వలెనే పెంపుడు పాములపై నిషేధం ఉంది. ఇక్కడి ప్రజలలో ఎవరైనా పాములను పెంచుకోవడానికి ఆసక్తి కనబరిస్తే అక్కడ సంబంధిత అధికారుల అనుమతి తప్పకుండా తీసుకోవలసి ఉంటుంది.

## ఐర్లాండ్

ఐర్లాండ్‌లో పాములు ఉండవు. ఐర్లాండ్ ఉత్తర అట్లాంటిక్‌లోని ఒక ద్వీపం. ఎందుకంటే ఐర్లాండ్ దేశం చాలా చల్లని వాతావరణం కలిగిన దేశం. వాతావరణపరంగా ఐర్లాండ్‌లో వెచ్చదనం అనేదే ఉండదు. పాములకు వెచ్చదనం, వెలుతురు



కలిగిన వాతావరణంలోనే జీవించగలవు. అందుకే ఐర్లాండ్‌లో పాములు అనేవే కనిపించవట. ఒకప్పుడు కొన్ని రకాల సాధారణ పాములు ఇక్కడ కనిపించేవి. అవి కూడా మూడురకాలే ఉండేవి. తీవ్రమైన చలివల్ల ఆ పాము జాతులు అంతరించిపోయాయి. అప్పటి నుండి అక్కడ ఉండే విపరీతమైన చల్లని వాతారణంలో పాములు జీవించలేక పోయాయి. ఐర్లాండ్‌లో ఇప్పటి వరకు పాములు ఉన్న దాఖలాలు లేవని ఫాసిల్ రికార్డ్స్ విభాగం చెబుతోంది. అలాగే 100 మిలియన్ల ఏళ్లక్రితం ప్రకృతి వైపరీత్యాల వల్ల ఐర్లాండ్ నీటిలో మునిగిపోయిందని అప్పటి నుండి ఇక్కడ పాములు కనిపించకుండా పోయామని కొందరు చెబుతుంటారు. కారణాలు ఏమైనా పాములు లేని దేశంగా ఐర్లాండ్ మిగిలింది.

## అలాస్కా

అలాస్కా పాము రహిత జోన్‌గా నిర్ధారించబడింది. అలాస్కా చాలా చల్లని వాతావరణం కలిగిన ప్రాంతం. సూర్యకాంతి పడే ప్రాంతం చాలా తక్కువ. సంవత్సరంలో తక్కువ ప్రాంతాల్లో మాత్రమే సూర్యకాంతి పడుతుంది. ఈ వాతావరణంలో ఏ జాతి పాములు జీవించినట్లుగా దాఖలాలు లేవని అంటారు. పాముల అవశేషాలు రికార్డుల్లో మాత్రమే ఉన్నాయట. అలాస్కాలో అరుదుగా కనిపించేది సాధారణ గార్డెర్ పాము మాత్రమేనట. ఈ పాము కూడా 1970కు పూర్వం కనిపించిందట. నాటి నుండి ఇక్కడ పాములను చూసిన వారు లేరు. అలాస్కాలో దాదాపు పాములు లేవు. ఇక్కడ ఉన్న ఏకైక సరీసృపం సముద్ర తాబేలు మాత్రమే.

## ఐస్‌లాండ్

పాములు నివసించలేని మరో దీవి ఐస్‌లాండ్. ఇది పేరుకు తగినట్టుగా ఐస్ ఉండే ప్రాంతం. పూర్తిగా మంచు ప్రాంతం. ఇక్కడ వాతావరణ పాములు నివాసానికి ఏమాత్రం అనువుగా ఉండదు. ఈ మంచు ప్రాంతంలో పాములు ఏమాత్రం జీవించలేవు. ఐస్‌లాండ్‌లో పాములు లేకపోయినా ఇక్కడ కనిపించే 'ఇసుక పాములు' గురించి గందరగోళానికి గురవుతారు. గాలి చాలా వేగంగా వీచినప్పుడే గాలిలో పైకి లేచిన ఇసుక పాము ఆకారంలో నేలపై పరుగులు తీస్తూ కనిపిస్తుంది. దీన్ని సాండ్ స్నేక్ (ఇసుక పాము) అని పిలుస్తారు. అంతేతప్ప ఇది నిజమైన పాము కాదు. గాలి ఒత్తిడికి ఏర్పడే ఒక రకమైన వింత అని చెప్పుకోవాలి. ఇదో గొప్ప అనుభూతిగా భావిస్తుంటారు పర్యాటకులు. వీటితోపాటు అగ్ని పర్వతాలు అధికంగా ఉండే హవాయి దీవులు, కుక్ ఐలాండ్, కేప్ వెర్డే, పసిఫిక్ దీవులు, ఉత్తర రష్యా, కెనడాలో కూడా పాములు లేవని నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం అక్కడి వాతావరణ పరిస్థితులే కారణమని తెలుస్తోంది. ❑



కథ

# పులి అత్యాశ

**ఒక** ఆవు దారితప్పి అడవిలోకి వెళ్లింది. ఎంత ప్రయత్నించినా బయటకు రావడానికి దారి కనిపించలేదు. అలా మెల్లగా దొరికిన గడ్డిని, ఆకులు తింటూ ముందుకు సాగింది. కొంతదూరం వెళ్లాక ఒక కొలను కనిపిస్తే కడుపునిండా నీరు తాగింది.

అప్పుడు ఒక పులి ఆవును గమనించి మెల్లగా ఆవు దగ్గరికి వచ్చింది. పులిని చూసిన ఆవు ప్రాణభయంతో వెనుకకు పరిగెత్తడానికి ప్రయత్నించింది కానీ, అక్కడ ఒక ముసలి నక్క అడ్డంగా నిలబడింది. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టు అయింది ఆవు పరిస్థితి.

'ఈరోజు నాకు చావు తప్పదు' అని మనసులో అనుకుని అలా భయపడుతూ నిలబడింది. పులి ఆవుతో 'ఈరోజు నిన్ను చంపకుండా వదలను. కొద్ది రోజులుగా నేను వేటకు వెళ్లడం లేదు. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు నువ్వు దొరికావు' అని చెప్పింది. వెనుక నుండి ముసలినక్క 'నాకు కూడా కొంచెం ఉంచండి పులిరాజా! నాకు ఇప్పుడు వేటాడే బలం లేదు. ఎవరో వేటాడి తిని వదిలిన మాంసాన్ని తింటున్నాను' అని చెప్పింది. ఆవు కొద్దిగా ధైర్యం తెచ్చుకుని 'పులిరాజా నాకు ఈరోజు చావు తప్పదని అర్థమయింది. కానీ నేను దారి తప్పి ఇలా వచ్చాను. నాతోపాటు ఇంకా కొన్ని ఆవులు అడవిలోకి వచ్చాయి. అవి ఎక్కడున్నాయో మీకు చూపిస్తాను. వాటిని కూడా వేటాడితే మీకు కొన్నాళ్లు వేటకు వెళ్లకుండా ఆహారం దొరుకుతుంది. వాటిని తిన్నాక నన్ను కూడా చంపి తినండి' అని ఆశ కలిగించింది. అది విన్న పులికి ఆత్రుత పెరిగింది. అప్పుడు పులి ఆవుతో 'నువ్వు చెప్పేది నిజమేనా? లేక నా నుండి తప్పించుకోడానికి ఎత్తుగడ వేస్తున్నావా?' అని గట్టిగా అడిగింది.



అప్పుడు ఆవు 'పులిరాజా నేను నిజమే చెప్తున్నాను. నా మాట నమ్మండి. నాతో వస్తే మీకే తెలుస్తుంది. ఆ ఆవులను చూసాక మీకే నమ్మకం కలుగుతుంది' అని చెప్పింది. ఇంతలో ముసలి నక్క పులితో 'పులిరాజా! దురాశకు పోకండి. దొరికిన ఆహారాన్ని మాటలతో కాలయాపన చేయకుండా వేటాడండి. ఈ ఆవు మాటలు నమ్మకంగా లేవు' అని అంది. పులి ముసలినక్క మాటలు పట్టించుకోలేదు. తనకు వేటలో మిగిలిన ఆహారం దొరుకుతుందని ఇలా అంటుందని మనసులో అనుకుని ఆవుతో వెళ్లడానికి సిద్ధపడింది. ముసలినక్క నడిచే ఓపిక కూడా లేదని అక్కడే ఉండిపోయింది. ఆవు వెనకాలే పులి వెళ్లింది. ఆవుకు పులి బారి నుండి ఎలా తప్పించుకోవాలి! అని ఆలోచిస్తూ ఉండగా, తను వచ్చేదారిలో వేటగాళ్లు ఒక ఉచ్చును సిద్ధం చేయడం గమనించిన విషయం జ్ఞప్తికి వచ్చింది. పులిని అటూ ఇటూ తిప్పుతూ ఉచ్చు ఉన్న చోటుకు తీసుకువెళ్లింది.

'పులిరాజా ఈ పొదల వెనకాల ఆవులు విశ్రాంతి తీసుకుంటున్నాయి. మీరు ఒక్కసారిగా పైనుండి దాడి చేయండి' అని చెప్పింది. పులి అత్యాశతో ఒక్కసారిగా పొదల్లోకి దూకింది. అక్కడ వేటగాడు పెట్టిన ఉచ్చుకు నేరుగా వెళ్లి చిక్కింది. వెంటనే ఆవు 'పులిరాజా విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు సమయస్ఫూర్తితో వాటినుండి బయటపడాలి. నాతోపాటు ఆవులు ఏవీ రాలేదు. మీ నుండి నన్ను రక్షించుకునేందుకు సమయస్ఫూర్తితో అబద్ధం చెప్పాను. మీరు దురాశతో ఇలా వేటగాడి వలలో చిక్కారు' అని చెప్పి పులి బారి నుండి తనను తాను రక్షించుకుని అడవి నుండి బయటపడింది.

– పుల్లట సంతోష్

## బాలగేయం

### బాలలం



బాలలం బాలలం
బడికెళ్లే బాలలం
తోటలో పువ్వుల్లా
వికసిస్తాం
నింగిలో చుక్కల్లా
వెలుగుతుంటాం
పొలంలో పండిన
పత్తికాయల్లా
నవ్వుతూ ఉంటాం
చెట్లమీద చిలకల్లా
పలుకుతుంటాం
గుడిలోని దీపాల్లా
వెలుగుతుంటాం
ఆమని కోయిలల్లా
పాడుతుంటాం
అడవిలో నెమలిల్లా
నాట్యం చేస్తాం
ఆడేటి వేళల్లో
ఆడుకొంటాం
చదివే సమయంలో
చదువుకుంటాం.

– చాడా మునిశేఖర్‌రెడ్డి

## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

- కె.అభినవ్, గుంటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'ఎండోస్కోపీ' అంటే ఏమిటి?**

**జవాబు: అభినవ్!** గాజును సన్నని నాళాలుగా తయారు చేయడం వల్ల అది కాంతిని ప్రసారం చేస్తుంది. ఇదే గాజుగొట్టాన్ని మరింత సన్నగా అంటే వెంట్రుక మందంకన్నా తక్కువగా రూపొందిస్తే దాన్ని 'ఆప్టికల్ ఫైబర్' అని అంటారు. ఈ విధంగా తయారైన ఆప్టికల్ ఫైబర్‌లను వైద్య పరికరంగా ఉపయోగించి మనిషి శరీర భాగాలను పరీక్షించే విధానాన్ని 'ఎండోస్కోపీ' అంటారు.

ఈ పరికరం ఎలా అంటే అలా సాగే గుణాన్ని కలిగి వుంటుంది. నోటి ద్వారాగానీ లేదా మరేదైనా శరీరంలోని సహజ రంధ్రాల ద్వారాగానీ ఈ ఎండోస్కోప్‌ను లోపలికి పంపిస్తారు. ఏ అవయవాన్నయితే పరీక్షించదలచుకున్నారో ఆ అవయవ కుహరంలోకి దీన్ని పంపించి పరీక్షిస్తారు. ఇందులో రెండు ఆప్టికల్ ఫైబర్‌లు ఉంటాయి. ఒక ఫైబర్ కాంతిని వెదజల్లుతుంటే వైద్య నిపుణులు మరో ఫైబర్ ద్వారా లేదా కెమెరా ద్వారా సంబంధిత శరీర భాగాన్ని పరీక్షిస్తారు. ఎండోస్కోప్‌ను ఉపయోగించడం వల్ల వైద్య నిపుణులు పొట్టలాంటి భాగాల్ని పరీక్షించేందుకు ఏ విధమైన శస్త్ర చికిత్సా చేయాల్సిన అవసరం ఉండదు.

- సి.శరత్‌చంద్ర, గద్వాల

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఆపిల్ పండును కోసి వుంచితే, కొద్దిసేపటికే రంగు మారుతుంది ఎందువల్ల?**


**జవాబు: శరత్!** ఆపిల్‌పండులో ఐరన్(ఫెర్రస్) వంతు అధికంగా ఉంటుంది. పండు కోసిన తర్వాత ఆ ముక్క వైపు భాగం వాతావరణంలోని ఆక్సిజన్ వాయువుతో ఆక్సీకరణం చర్య జరుపుతుంది. ఈ కారణంతో ఉపరితలం మీద ఫెర్రస్ ఆక్సైడ్ పొర తరహాలో పొర ఏర్పడుతుంది. దీని వల్ల మనకు రంగు మారినట్టు కనపడుతుంది.



# జాగ్రత్త లేకపోతే బొక్కే

డా॥ చిట్యాల రవీందర్

**ఇంటర్నెట్** వినియోగం ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పెరిగిన తర్వాత, సైబర్ నేరాలు కూడా అదే నిష్పత్తిలో పెరుగుతున్నాయి. ఈ డిజిటల్ యుగంలో, సైబర్ కేటుగాళ్లు తమ బాధితులను నమ్మబలికి, వారికి లింక్‌లు పంపించి, క్లిక్ చేయించి, వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని చోరీ చేస్తారు. విశాఖపట్నంలో జరిగిన సైబర్ నేరాలు చూస్తే, విశాఖపట్నం, ముఖ్యమైన ఆర్థిక కేంద్రంగా ఎదగడం వల్ల సైబర్ నేరాల సంఖ్య కూడా పెరిగింది. ఇటీవల కొన్ని ప్రముఖ సైబర్ నేరాలు చోటు చేసుకున్నాయి. అందులో బ్యాంకింగ్ ఫ్రాడ్ ఒకటి. ఇటీవల విశాఖపట్నంలో బ్యాంకింగ్ సంబంధిత సైబర్ నేరాలు పెరిగాయి. నకిలీ బ్యాంకింగ్ లింక్‌లను పంపించి, ప్రజల బ్యాంక్ అకౌంట్‌ల నుండి డబ్బులు దోచుకున్నారు. ఉదాహరణకు, ఒక వ్యక్తికి బ్యాంక్ నుండి వచ్చినట్లు ఒక ఫిషింగ్ ఇమెయిల్ వచ్చింది. ఆ లింక్‌ను క్లిక్ చేయగా, అతని బ్యాంక్ అకౌంట్ నుండి రూ.50,000కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు పోయింది. ఉద్యోగ అవకాశాల పేరుతో టార్గెట్ చేసే నేరాలు కూడా విశాఖపట్నంలో ఎక్కువయ్యాయి. నకిలీ ఉద్యోగ ప్రకటనలు, ఇంటర్వ్యూ లింక్‌లు పంపించి, వ్యక్తుల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు. ఒక నిరుద్యోగ యువకుడు నకిలీ ఉద్యోగ ఇమెయిల్‌లోని లింక్‌ను క్లిక్ చేయడంతో, అతని వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు దొంగలించబడ్డాయి. సైబర్ నేరగాళ్లు అమెజాన్ గిఫ్ట్‌కార్డుల పేరుతో నకిలీ లింక్‌లు పంపుతున్నారు. ఈ లింక్‌లను క్లిక్ చేస్తే, వారి వ్యక్తిగత వివరాలు, క్రికెట్ కార్డ్ సమాచారం దొంగలించబడుతోంది. విశాఖపట్నంలో ఒక వ్యక్తి ఈ విధంగా మోసపోయాడు. అతని క్రెడిట్ కార్డ్ సమాచారం దొంగలించబడింది. విశాఖపట్నంలో ఒక వ్యక్తి ఈవిధంగా మోసపోయాడు. అతని క్రెడిట్‌కార్డ్ నుండి రూ.20,000 వరకు డబ్బు డెబిట్ చేయబడింది. సైబర్ నేరాలు అనేక పద్ధతులను ఉపయోగించి జరుగుతాయి. వాటిలో ముఖ్యమైనవి ఫిషింగ్, స్పియర్ ఫిషింగ్, స్మిషింగ్, విసింగ్. అనేది సైబర్ నేరాలలో అత్యంత సాధారణ పద్ధతి. ఈ పద్ధతిలో సైబర్ నేరగాళ్లు నమ్మకమైన వ్యక్తుల లేదా సంస్థల పేరుతో మేసెజ్‌లు లేదా ఇమెయిల్‌లు పంపుతారు. అవి నిజమైనవి అనిపించేలా రూపకల్పన చేస్తారు. ఈ మెసేజ్‌లు లేదా ఇమెయిల్‌లలో ఉన్న లింక్‌లను క్లిక్ చేయమని కోరతారు. ఇటువక్క వాళ్లు ఆ లింక్‌లను క్లిక్ చేసినప్పుడు, వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడానికి ఒక నకిలీ వెబ్‌సైట్ వుంటుంది. స్పియర్ ఫిషింగ్ అనేది ఫిషింగ్‌లో ఒక ఆధునిక పద్ధతి. ఇది సాధారణ ఫిషింగ్ కంటే మరింత ప్రమాదకరం. స్పియర్ ఫిషింగ్‌లో, నేరగాళ్లు ఒక నిర్దిష్ట వ్యక్తిని లక్ష్యంగా చేసుకుంటారు. వారి గురించి విపులమైన సమాచారాన్ని సేకరించి, ఆ సమాచారాన్ని ఉపయోగించి మెసేజ్‌లు పంపుతారు. స్మిషింగ్ అనేది ఫిషింగ్‌లో ఒకరకం. ఇందులో నేరగాళ్లు టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా వినియోగదారులకు లింక్‌లు పంపిస్తారు. వీటిని నమ్మించి క్లిక్ చేయిస్తారు. ఈ పద్ధతిలో నేరగాళ్లు బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లువ వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారు. విసింగ్ అనేది వాయిస్ ఫిషింగ్. ఇందులో టెలిఫోన్ ద్వారా వాడకందారుల సమాచారాన్ని సేకరించడమే కాకుండా వారికి లింక్‌లు పంపించి క్లిక్ చేయమని కోరడం జరుగుతుంది. టెలిఫోన్ నంబర్లను నమ్మకమైనవిగా చూపిస్తూ మోసం చేయడంలో విసింగ్ నేరగాళ్లు నిష్ణాతులై వుంటారు.




సైబర్ నేరాలనేవి వ్యక్తులకు, సంస్థలకు, ప్రభుత్వాలకు తీవ్రనష్టం కలిగిస్తాయి. వ్యక్తిగతంగా, బ్యాంక్ ఖాతాలు, క్రెడిట్ కార్డ్ వివరాలు వంటి ఆర్థిక సమాచారాన్ని కోల్పోవడం, వ్యక్తిగత డేటా దొంగలించబడడం వంటివి జరగవచ్చు. సంస్థలకు, డేటాలీక్, ఆర్థిక నష్టం, పరువు పోగొట్టు కోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి.

ప్రభుత్వాలకు, జాతీయ భద్రతకు ముప్పు, కీలక సమాచారాన్ని కోల్పోవడం వంటి సవాళ్లు ఉంటాయి. సైబర్ నేరాల నుండి రక్షణ పద్ధతులు పాటించాలంటే నిజమైన సోర్సెస్ మాత్రమే క్లిక్ చేయాలి. ఎవరైనా పంపించిన మెసేజ్‌లు, ఇమెయిల్‌లు కేవలం నమ్మకమైనవిగా ఉంటేనే క్లిక్ చేయాలి. సందేహాస్పదమైన లింక్‌లను క్లిక్ చేయకముందు సంబంధిత వ్యక్తులతో లేదా సంస్థలతో ధృవీకరించడం చేసుకోవాలి. సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరాలను అరికట్టవచ్చు. తరచుగా సైబర్ సెక్యూరిటీ శిక్షణలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడం ఉపయోగకరం. మనం ఉపయోగించే పాస్‌వర్డ్‌లు బలమైనవిగా ఉండాలి. వీటిని తరచుగా మార్చడం మంచిది. పాస్‌వర్డ్ మేనేజర్‌లను ఉపయోగించడం సురక్షిత పాస్‌వర్డ్‌లను నిర్వహించడంలో సహాయపడుతుంది.



అదనపు భద్రత అందించడానికి మల్టీ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌ను అమలు చేసుకోవాలి. ఇది ఖాతాలను అనధికార ప్రవేశాన్ని నిరోధించడానికి సహాయపడుతుంది. బ్రౌజర్ సెట్టింగ్‌లను సరిచేసి, అన్ని ఆప్డేట్‌లను అమలు చేయడం, బ్రౌజింగ్ సమయంలో హెచ్‌టిటిపిఎస్ సైట్‌లను మాత్రమే వినియోగించడం మంచిది. కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్ పరికరాలను రక్షణ కోసం యాంటీవైరస్ మాల్వేర్ రక్షణ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని ఆప్డేట్ చేసుకోవాలి. వాడే స్మార్ట్‌ఫోన్, టాబ్లెట్ వంటి పరికరాలను అనవసర లింక్‌లు, అనుమానాస్పద అప్లికేషన్‌ల నుండి దూరంగా ఉంచాలి. సైబర్



## నేరాల నివారణలో ప్రభుత్వం పాత్ర

ప్రభుత్వాలు సైబర్ నేరాలను అరికట్టడంలో కీలకపాత్ర పోషిస్తాయి. సైబర్ నేరాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, కొత్త చట్టాలను అమలు చేయడం, సైబర్ సెక్యూరిటీ నిపుణులను నియమించడం వంటి చర్యలు తీసుకోవాలి. సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచడం ద్వారా ప్రజలను సంస్థలను సైబర్ నేరాల నుండి రక్షించవచ్చు. ప్రభుత్వాలు, నాన్-ప్రాఫిట్ ఆర్గనైజేషన్లు, కార్పొరేట్ సంస్థలు కలిసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం మంచిది. సైబర్ నేరాలను నియంత్రించడానికి ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు వివిధ చట్టాలను, నిబంధనలను ప్రవేశపెట్టాయి. ఇవి సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడం, నేరగాళ్లను శిక్షించడం, సైబర్ నేరాల బారినపడిన వారికి న్యాయం అందించడం లక్ష్యంగా ఉన్నాయి. భారతదేశంలో, సైబర్ నేరాలను అరికట్టడానికి సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడానికి వివిధ చట్టాలు అమల్లో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం, 2000 (ఐటి యాక్ట్, 2000), ఇది భారతదేశంలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రధాన చట్టం. ఈ చట్టం కింద సైబర్ నేరాలకు సంబంధించి అనేక నిబంధనలు ఉన్నాయి. ఫిషింగ్, హ్యాకింగ్, ఐడెంటిటీ థెఫ్ట్ వంటి నేరాలకు శిక్షలు విధిస్తుంది. ఐటి (అమెండ్‌మెంట్) 2008 సం.లో ఈ చట్టం సవరణ చేయబడింది. ఈ సవరణ సైబర్ టెర్రరిజం, పర్సనల్ డేటా ప్రొటెక్షన్, డేటా బ్రెచెస్ వంటి కొత్తసైబర్ నేరాలను చట్ట పరిధిలోకి తీసుకువచ్చింది.

విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీస్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ఇంటర్నెట్ సురక్షిత వినియోగం, డేటా ప్రైవసీ, పాస్‌వర్డ్ రక్షణ వంటి అంశాలపై వారికి శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వాలు సైబర్ నేరాల నివారణకు సంబంధించి పటిష్టమైన చట్టాలను ప్రవేశపెట్టాలి. అంతేకాదు వాటిని అమలు చేయాలి. సైబర్ సెక్యూరిటీ నిపుణులను నియమించి, వారితో కలిసి సైబర్ నేరాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలి. సంస్థలు తమ ఉద్యోగులకు సైబర్ సెక్యూరిటీపై శిక్షణ ఇవ్వాలి. సురక్షిత ఐటీ మౌలిక వసతులను ఏర్పాటు చేయాలి. సైబర్ దాడులను గుర్తించి నివారించడానికి చర్యలు తీసుకోవాలి. వ్యక్తులు సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలి. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలి. బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం, పాస్‌వర్డ్‌లను తరచుగా మార్చడం, మల్టీ-ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను అమలు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. సైబర్ నేరాలు ఈ డిజిటల్ యుగలో అనివార్యమైపోయాయి. వాటిని అరికట్టడం, నివారించడం, బాధితులకు సహాయపడటం కోసం వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవడం, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సైబర్ నేరాలను అరికట్టవచ్చు. చట్టాలు, నిబంధనలను కఠినంగా అమలు చేసి, నేరగాళ్లకు కఠిన శిక్షలు విధించడం ద్వారా సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచవచ్చు. తస్మాత్ జాగ్రత్త. ❍



కథ

# తీరిన కల

సింగంపల్లి శేష సాయికుమార్

"నువ్వు రాసే ఆ పిచ్చి రాతలు ఎవరికైనా ఇంత కూడు పెట్టాయా? చెప్పు. నీ వయసున్న మగాళ్లు అందరూ ఇప్పటికే ఎడా పెడా అలుపెరగకుండా సంపాదించి నాలుగు రాళ్లు వెనకేసుకున్నారు. నువ్వేమో ఆ ఒక్క బోడి ఉద్యోగం చేసి ఇంటికొచ్చి ఖాళీ సమయం మాతో గడపకుండా పిచ్చి పిచ్చి కథలు రాస్తూ కూర్చుంటావు.

ఏమన్నా అంటే "ఈరోజు ఆ పేపర్లో పడింది రేపు ఇంకో దాంట్లో పడుతుంది" అంటూ చెప్పి "ఉత్తుత్తి సంబరం పడటం తప్ప నువ్వు రాసే ఆ రాతలకు కనీసం ఒక్క దమ్మిడీ కూడా రాలదు" అంటూ రాత్రి ఏకాంత సేవకు స్వాగతం పలుకుతోంది సుజాత.

కాదేదీ కవితకు అనర్హం అన్న శ్రీశ్రీ మాటలు గుర్తు తెచ్చుకొని మరీ వాటికి చిరుమందహాసంతో సమాధానం చెప్పటం గత నాలుగేళ్ల నుండి అలవాటు చేసుకున్నాడు ప్రశాంత్. వయసు పైబడుతున్నకొద్దీ తన రాతలు ఎక్కువైనాయి.

ఉద్యోగం, రాయడం తప్ప తనకు ఇంకో వ్యాపకం లేదు. నిజమే..చిన్నప్పటి నుండి తండ్రి ఏది తెచ్చి పెడితే అది తిని చదువుకున్నాడు. ఇప్పుడు ఆయన చనిపోతే అదే ఉద్యోగం చేస్తూ జీవితం వెళ్లబుచ్చుతున్నాడు. అయినా అలా ఎగబడి సంపాదించాలన్న ఆలోచన అతనికి ఇంతవరకు కలగలేదు.

ఓ రోజు ఆలుమగలు ఇద్దరూ కలిసి వనజాక్షి ఇంటి గృహప్రవేశానికి వెళ్లారు. వనజాక్షి వాళ్ల దగ్గరి బంధువు వేలు విడిచిన అత్తకూతురు కూడా. "అసలు తన భర్త చేసే అంత చిన్న ఉద్యోగంతో ఇంత విలాసవంతమైన ఇల్లు ఎలా కట్టగలిగింది. అయినా డబ్బు సంపాదించడం అంత సులువు అయితే మా ఆయన ఎందుకు సంపాదించడం లేదు? నిజంగా మేం చేతగాని వాళ్లమా? ఎందుకు ఇంత మందిలో మేమే ఇలా ఉన్నాం?" అంటూ లక్ష ప్రశ్నలు మదిలో గిర్రున తిరుగుతున్నాయి సుజాతకు.

ఏది ఏమైనా డబ్బు సంపాదించడం ఒక కళ. దానికి కూడా కాస్త నైపుణ్యం ఉండాలి.. అనుకుంటూ ఎక్కడో మనసుతో అక్కడ ఎలా తిరుగుతోంది.

"ఏమోయ్ సుజాతా, నువ్వు ఒక్కదానివే అలా పక్క పక్కకు తిరుగుతున్నావు. మీ ఆయనతో కలిసి చిలకా గోరింకల్లా ఉంటే ఏమైనా దిష్టి తగులుతుందా చెప్పు?" అంది.

"అదేంలేదు అక్కా, మీ ఇల్లు చూసి మేం కూడా ఎప్పుడైనా కడితే ఇలాంటి ఇల్లు కట్టాలని ఒకటికి పది సార్లు చూస్తున్నాను" అంది సుజాత.

"దాందేం భాగ్యం? మళ్లీ మరచిపోతావేమో! నీ దగ్గర ఉన్న ఫోన్‌తో వీడియో తీసుకో. అప్పుడప్పుడు చూస్తూ ఉండొచ్చు" అంటూ మంచి ఒక ఉచిత సలహా కూడా ఇచ్చింది.



.........

ఓ పక్క ఆయాసం, మరోపక్క ఆతృతతో ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వచ్చి ఉన్నపళంగా అన్ని మూలలూ కలియతిరుగుతూ వెతుకుతున్నాడు రాజేంద్ర.

అతనిలో ప్రతి క్షణం ఎక్కడైనా ఆ కాగితం కనపడకుండా పోతుందా అన్న తపన స్పష్టంగా కనిపిస్తోంది.

ఏమైందని? భార్య పదే పదే అడిగినప్పటికీ నోరు మాత్రం కదపడం లేదు. ఇంట్లోని అన్ని మూలలూ వెదకడం అయిపోయాయి. ఉన్నట్టుండి వెళ్లి సోఫాలో కూర్చుని తల గిర్రున తిరుగుతున్న ఫ్యానుకేసి చూస్తూ "ఇక నన్ను ఎవ్వరూ కాపాడలేరు" అని గట్టిగా నిట్టూర్చాడు రాజేంద్ర.

"ఏమైందో ముందు చెప్పండి. ఆ తర్వాత సమస్యకు పరిష్కారం గురించి ఆలోచిద్దాం" అంది భార్య.

"నీకు తెలుసు కదా, రేపు షూటింగు ఉందని.. డైరెక్టర్‌గారు ఫోన్ చేశారు. దానికి సంబంధించి రాసి ఉంచిన స్క్రిప్ట్ కనపడటం లేదు. అది నేను రేపు అందివ్వలేకపోతే కొన్ని కోట్లలో నష్టం, అది కచ్చితంగా నేనే భరించాల్సి వస్తుంది" అన్నాడు.

అతని మాట ఇంకా ముగియకుండానే "ఓస్.. అంతేనా! అయితే మీరు రాసిన స్క్రిప్టే కదా. అది మళ్లీ రాయొచ్చుగా. మీకు గుర్తు ఉండకుండా పోతుందా?" అంది ఆమె.

"అంతా నా కర్మ. అందరి ముందు నేను ఒక విషయం దాచాను. అదేంటంటే నేను రాసే ప్రతి కథ నా దగ్గర పనిచేసే సహాయకుల దగ్గర రాయించుకుని దానికి నా పేరు వేయించుకోవడం అలవాటుగా మారిపోయింది. ఇప్పుడు డబ్బులు ఎక్కువ అడుగుతున్నారని నా దగ్గర రాసేవారిని పంపించేసాను. ఇప్పుడు వాడిని ఏ ముఖం పెట్టుకుని అడగమంటావ్?" అంటూ తల పట్టుకున్నాడు.

“అయితే ఇప్పుడెలా?” అంది ఆమె.

“అర్జంటుగా నాకు రాసేవాడు కావాలి. ఎక్కడ దొరుకుతాడు?” అంటూ భార్య వైపు చూశాడు.

అంతటి టెన్షన్‌లో కూడా ఆమె మెదడు పాదరసంలా పనిచేసింది. టక్కున ఒకరి పేరు గుర్తుకు వచ్చింది.

“ఏవండీ! మర్చిపోయారా? మన పక్క ఇంట్లో ఉండే ప్రశాంత్ ఒకసారి వచ్చి తను చిన్న చిన్న కథలు రాస్తుంటానని, మీకు తెలిసిన వారికి పరిచయం చెయ్యమని అడిగాడు. మీరేమో ఆ... ఇక్కడ అసలుకే లేకుంటే కొసరుకు అడిగాడంట నీలాంటివాడు.. అని మీరు తిట్టి పంపారు, మర్చిపోయారా?” అంది ఆమె.

“నువ్వు చెప్పింది నిజమే. కానీ అతనికి నిజంగా అంత టాలెంట్ ఉందంటావా?” అన్నాడు ఎక్కడో ఓ మూల ఆశతో.

“ఏమో ఒకసారి ప్రయత్నించండి” అంది ఆమె. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఒక్క ఉదుటున వాళ్ల ఇంట్లోకి వాలిపోయాడు. తలుపు గట్టిగా తడుతుంటే ఎవరా? అని గాభరాగా తెరిచాడు ప్రశాంత్.

“లోపలకు రావచ్చా?” అన్నాడు రాజేంద్ర.

“ఓ తప్పకుండా...” అంటూ తన చేతిని సోఫా వైపు మళ్లించాడు ప్రశాంత్.

సుత్తి లేకుండా డైరెక్టుగా విషయానికి వచ్చేశాడు రాజేంద్ర “మీరు కథలు రాస్తారా?” అన్నాడు మెల్లగా.

“అవునండీ, ఇప్పటివరకు దాదాపు వంద కథలు వివిధ దినపత్రికలలో ప్రచురించారు కూడా” అన్నాడు ప్రశాంత్.

“అయితే నేనొక సన్నివేశం చెబుతాను, దానికి స్క్రిప్టు రాయగలరా?” అన్నాడు తెలివిగా.

“మీలాగా కాకపోయినా ప్రయత్నిస్తాను, చెప్పండి” అంటూ అట్ట, పెన్ను, పేపరు తీసుకొని కూర్చున్నాడు.

రాక రాక వచ్చిన అవకాశం ఎలాగైనా అభినందన పొందాలని చెప్పిందంతా విని తనదైన శైలిలో రాసి చేతికిచ్చాడు.

దాన్ని చదివిన రాజేంద్ర ముందు తాను రాయించిన దానికంటే బాగుండటంతో టక్కున లేచి ప్రశాంత్‌ను హగ్ చేసుకున్నాడు.

.........

తాడిని తన్నేవాడు వుంటే, వాడి తల తన్నేవాడు ఉంటాడు అన్నది ఎంత నిజమో ఇప్పుడు తాను రాసింది ఇంతకుమునుపు తాను రాసిన శైలికి భిన్నంగా వుండటంతో పసిగట్టిన దర్శకుడు ఇప్పుడు రాసింది నువ్వు కాదనీ, దీన్ని రాసిన అతన్ని తీసుకురాకపోతే నీకు పని ఉండదని చెప్పడంతో చేసేదేమీ లేక ప్రశాంత్‌ను వాళ్లకు పరిచయం చేశాడు రాజేంద్ర.

తలుపు తట్టి వచ్చిన అవకాశాన్ని అమాంతం అందిపుచ్చుకున్నాడు ప్రశాంత్.

సుజాత ఆనందానికి అవధుల్లేవు, ఇన్నాళ్లకు తాను కోరుకున్నది జరగడం ప్రారంభమైందని తలచుకొని మరీ మురిసిపోతోంది.

జరుగుతున్న ప్రాజెక్టు మొత్తం ప్రశాంత్ పూర్తి చేశాడు.

దర్శకుడు నిర్మాతను అతనికి ఇవ్వవలసిన డబ్బును ఇవ్వమన్నాడు.

“నీ పనికి వచ్చే డబ్బు తీసుకోమంటూ ఊహించనంత మొత్తాన్ని అతని చేతిలో పెట్టు, తమ తదుపరి ప్రాజెక్టులకు కూడా నీకే అవకాశం ఇస్తామని చెప్పి పంపించారు.

.........

కొద్ది రోజులు గడిచాయి. అక్కడ ఇచ్చిన డబ్బు గురించి ఇంట్లో చెప్పకపోవడంతో సుజాతకు అనుమానం వచ్చింది. ఎంత ఇచ్చారు? దాన్ని ఏం చేసారు? అది చెప్పక పోవడం సుజాత ఆవేశాన్ని మరింత పెంచింది. ఎన్నిసార్లు అడిగినా ఒకటే సమాధానం “అన్ని విషయాలు నీకు త్వరలోనే చెప్తా” అంటూ ముక్తాయింపు ఇస్తున్నాడు.

ఎంత అడిగినా చెప్పకపోవడంతో అడగటం మానేసింది సుజాత. మొత్తానికి తనకు తెలియకుండా ఏదో జరుగుతోందని మాత్రం అర్థమవుతోంది, కానీ ఏం జరుగుతున్నదీ తోచడం లేదు.

ఒకరోజు హడావిడిగా “సాయంత్రం బయటకు వెళ్లాలి, ఈరోజు నా లైఫ్‌లో మరచిపోలేని రోజు నువ్వు రెడీగా ఉండు వెళ్లాలి” అన్నాడు ప్రశాంత్.

ఆ.. ఎక్కడికి..ఏదో గుడికో గోపురానికో అయి ఉంటుంది.. అనుకుంటూ తయారైంది.

ఇద్దరు కలసి ఆటోలో టౌన్‌లోని కళాక్షేత్రం ముందు దిగారు. గేటు ముందు ఒక పెద్ద బ్యానర్, అందులో అక్షరాల కన్నా ముందు ఆమె చూపు అందులో ఉన్న ప్రశాంత్ బొమ్మ పైన పడింది.

అంతా అయోమయంగా ఉంది పుస్తకావిష్కరణ కార్యక్రమానికి స్వాగతం అంటూ కనబడుతోంది.

వేదిక పైకి వచ్చి కూర్చోమన్నాడు ప్రశాంత్, ఎందుకు అన్నట్టు చూస్తూనే గమ్మున వచ్చిన కూర్చుంది.

అందరూ తన భర్తను పొగుడుతున్నారు. గొప్ప రచయిత అంటున్నారు, పుస్తకం బాగుంది... అంటున్నారు. అయినా గందరగోళం వీడలేదు.

కాసేపటికి అందరూ స్టేజీ మధ్యలోకి చేరారు. సుజాత చేతికి ఒక గిఫ్ట్ ప్యాక్ చేసిన వస్తువుని ఇచ్చారు. దాన్ని తీయమన్నారు అక్కడున్నవారు, కాస్త సహాయపడ్డాడు ప్రశాంత్. తెరిచి చూస్తే అది పుస్తకం. దానిపై రచయిత ములుమూడి ప్రశాంత్ అని ఉంది.

“నేనొక సన్నివేశం చెబుతాను, దానికి స్క్రిప్టు రాయగలరా?” అన్నాడు తెలివిగా. “మీలాగా కాకపోయినా ప్రయత్నిస్తాను, చెప్పండి” అంటూ అట్ట, పెన్ను, పేపరు తీసుకొని కూర్చున్నాడు.

అప్పుడు అర్థమైంది ఆయన రాసిన పుస్తకం అని. ఇన్నాళ్ల ఆయన కల నెరవేరింది. ఎప్పుడూ ఒక పుస్తకం ముద్రించుకోవాలి అని అంటుండేవాడు. కానీ అందుకు డబ్బు అవసరం కాబట్టి సంపాదనను బట్టి వెనకడుగు వేసేవాడు. ఇప్పుడు అర్థం అయింది.. మొన్న వాళ్లు ఇచ్చిన డబ్బు వృధా కాకుండా అక్షరానికి ప్రాణం పోశాడన్న మాట.

ఒక్కసారిగా అతన్ని గట్టిగా అల్లుకుంది. అతని నోట మాట రాలేదు. కళ్ల నుండి చెమ్మ కళ్లజోడుపై పడి మసకబారింది. సుజాత మాట గట్టిదైనా మనసు మాత్రం వెన్న అని తనకు తెలుసు. ఇంతకీ తను రాసిన పుస్తకం పేరు చెప్పలేదు కదూ...

“తీరిన కల”.

# విద్యాపథం

అయినంపూడి వెంకట నారాయణ

“విద్యా దదాతి వినయం” అనేది ఆర్యోక్తి.

విద్య వినయాన్ని చేకూరుస్తుంది. విద్య పరిపూర్ణం కావాలంటే సాధారణంగా చదివితే సరిపోదు. దానికి అసాధారణమైన కృషి, పట్టుదల మెండుగా ఉండాలి. ముందుగా



విద్యార్థిలో సరైన దృక్పథం ఉండాలి. లక్ష్యాన్ని సలక్షణంగా నిర్ణయించుకోవాలి.

అందుకే “దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది” అని మన పెద్దలంటారు. దృక్పథం పట్ల స్పష్టత ఉన్న విద్యార్థి ఏ రంగంలో అయినా తరంగంలా విజృంభిస్తాడు.

విద్యార్థికి దృక్పథంతో పాటు సరైన వాక్కు ఉండాలి. ఆ వాక్కు మనిషికి నిజమైన అలంకారం. “నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది” కదా. మనిషికి వాక్శుద్ధి ఉంటే వాక్సిద్ధి ఉంటుంది.

అలాంటి సరైన వాక్కు విద్యార్థి జ్ఞాన సముపార్జనకు దారి చూపిస్తుంది. జీవితమనే సమరంలో గెలుపు తీరాలకు చేకూరుస్తుంది. విద్యలో విద్యార్థికి కావలసిన తదుపరి విద్యా ఉపకరణం చర్య. దీనికి స్పందన, కదలిక అని అర్థం. స్పందనకు మూలం చర్య. విద్యార్థిలో కలిగే ఆసక్తిపూర్వక స్పందనే చర్య. ఈ చర్య ద్వారా చదువులో జ్ఞాన ప్రసారానికి అడ్డంకి లేకుండా భవిష్యజ్జీవనానికి మార్గం సుగమం అవుతుంది.

చదువులో ఏకాగ్రత కూడా చాలా అవసరం. ఏదైనా ఒక అంశంపై మనసును పూర్తి స్థాయిలో లగ్నం చేయడాన్ని ఏకాగ్రత అంటారు.

ఏకాగ్రత ఉన్న విద్యార్థి జ్ఞానాన్ని తొందరగా అందిపుచ్చుకుంటాడు. ఏ పనైనా తొందరగా నేర్చుకోగలుగుతాడు. నిత్యోత్సాహిగా ఉంటాడు. ఉత్సాహం ఉన్న విద్యార్థిలో ఆసక్తి ఉంటుంది. ఆసక్తి ఉన్నవాడికి ఏకాగ్రత ఉంటుంది. అది జీవితంలో సంతోషాల పూవులను పూయిస్తుంది.

ఏకాగ్రతతో పాటు విద్యార్థి చేయాల్సింది సరైన కృషి, అప్రయత్నంగా ఎవరూ ఏ రంగంలోనూ రాణించలేరు. అందుకే మన పెద్దలు ‘కృషితో నాస్తి దుర్భిక్షం” అంటారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకునే విద్యార్థి సరైన కృషి చేయడం ద్వారా అతని జీవన పథానికి అది సరైన ఊతమవుతుంది. అలాంటి విద్యార్థిలో ఆసక్తి, ఆ శక్తి రెండూ ఉంటాయి.

సక్రమమైన చదువు గౌరవప్రదమైన జీవనోపాధిని చూపిస్తుంది. జీవనోపాధికి అనేక కులవృత్తులు ఉన్నాయి. కానీ ఒక గౌరవప్రదమైన జీవనోపాధిని చూపించేది చదువు మాత్రమే. గురుముఖతః నేర్చుకున్న జ్ఞానం విద్యార్థులలో జ్ఞాన దీపాన్ని వెలిగించి ఉపాధికి దారి చూపిస్తుంది.

సాధారణమైన వృత్తులు కేవలం ఆ వృత్తులకు మాత్రమే పరిమితమై ఉండి కొత్త ఆవిష్కరణలకు తోడ్పడవు. చదువు వలన పొందిన ఉపాధి ద్వారా సమాజంలో విలువ పెరుగుతుంది. నూతన ఆవిష్కరణలకు అది దోహదం చేస్తుంది. చదువు మాత్రమే ఆ సౌకర్యాన్ని కలిగించి అసౌకర్యాన్ని దూరం చేస్తుంది.

ఇన్ని లక్షణాల ద్వారా నేర్చుకున్న చదువు మనిషిలోని సమగ్ర మూర్తిమత్వాన్ని ఆవిష్కరిస్తుంది. విద్యార్థిలో విశాల దృక్పథాన్ని పెంపొందిస్తుంది. ఎక్కడైనా విలువగా, నిర్భయంగా బతికే ధైర్యాన్నిస్తుంది. చదువంటే 100 పేజీల పుస్తకం కాదు, వందల మందిలో నిలబెట్టే ధైర్యం. అంతేకాక భౌతిక ప్రపంచ విషయాలను తెలుసుకోవడం, వాటిని మన వాస్తవ జీవితానికి అన్వయించుకోవడం.

ఎవరో చెప్పిన విషయాలను సిద్ధాంతంగా ప్రామాణీకరించి చెప్పడం చదువు అంతిమ లక్ష్యం కాదు. వారు చెప్పినదానిని ఆధారంగా చేసుకొని మనలో ఉన్న సృజనాత్మక శక్తులను మేల్కొలిపి, మన దృక్పథాన్ని సరిచేస్తూ నూతన ఆవిష్కరణలకు జీవం పోసేదే నిజమైన చదువు. ఆ చదువుకు ఏకాగ్రత, కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం అనేవి పట్టుగొమ్మలు.

---




ప్రదీప్: ఏంటీ! ఇంతసేపు అయినా వంట చేయలేదా? పొద్దున్నుండి ఏం చేస్తున్నావు? సరేలే. నేను హోటల్‌కి వెళ్లి తినొస్తాను.

సుజాత: ఏమండీ! ఒక్క ఐదు నిమిషాలు ఉండండి.

ప్రదీప్: ఆశ్చర్యపోతూ ఏంటీ? ఐదు నిమిషాలలో వంట చేస్తావా?

సుజాత: అయ్యో! అది కాదండీ. ఐదు నిమిషాల్లో చీర మార్చుకుని వస్తా. మీతో పాటు నేను కూడా హోటల్‌కు వస్తాను.

## అడ్రస్ చెప్పండి!

సుజాత: మా అత్తగారి తలనొప్పికి డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చారు కానీ ఆవిడ చనిపోయారు.

రమణి: ఔనా! ఆ డాక్టర్ అడ్రస్ ఇవ్వు. మా అత్తగారికి కూడా తలనొప్పి ఉంది.

**- ఈ.ఎస్.మాధవన్**

# జగము నేలిన తెలుగు




జయసూర్య

**ఆంధ్ర,** తెలంగాణ రెండు వేరు వేరు రాష్ట్రాలు కావచ్చు. కానీ తెలుగు అనే గొడుగు కింద కలసి మెలసి చేయవలసిన బాధ్యతలు చాలా ఉన్నాయి. రెండు ప్రాంతాలకు చెందిన ఘన చరిత్రను ఆవిష్కరించుకోవాల్సి ఉంది. విశాలాంధ్ర ఏర్పడినా, నేటికీ తెలుగు ప్రజల్లో భాషాభిమాన ఐక్యత అంతంత మాత్రంగానే వుంది. నాడు మద్రాసు నుంచి ఆంధ్రులు విడిపడినట్టే హైదరాబాద్ నుంచి బయట పడటం ప్రాంతీయ, పాలనా పరంగా చారిత్రక ఆవశ్యకమైంది. భాషా పరంగా ఆలోచిస్తే తెలుగుకు కన్నడం, తమిళం, ఉర్దూ ఇతర భాషలతో ఉమ్మడి బాంధవ్యం కాలగతిలో ఉండేది.









భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత క్రమేపీ ఆ బాంధవ్యం సన్నగిల్లింది. అదే చారిత్రక బాంధవ్యం సమిష్టి స్ఫూర్తి లేకపోవడం, ఆయా రాష్ట్రాల అస్తిత్వ ధోరణులు ఆపేక్షల కారణంగా కనుమరుగవుతోంది. రాజకీయాలకు అతీతంగా భాషాపరంగా ఆలోచించడం, ప్రతిష్ఠించుకోవడం ఎన్నో సమస్యలతో ముడిపడి వుంది. రాజకీయ రంగంలో అంతగా భాషకు ప్రాధాన్యత లేదు.

దక్షిణాది రాష్ట్రాలు పరిశీలిస్తే ప్రస్తుత స్థితిగతులలో ఒక్క తమిళనాడు విభిన్నంగా స్పష్టమవుతోంది. భాషావేశం అన్నా భాషాభిమానం అన్నా, భాష ద్వారా ఐక్యత అన్నా, విభిన్నంగా తమిళం అక్కడ ఆదరింపబడుతోంది. తమిళంతో మనకు పరిచయం లేకపోయినా, అర్థం చేసుకొని దైనందిన వ్యవహారాలు చక్కబెట్టుకోవలసిన అవసరం తమిళనాడులో ఉంది. ఆంగ్లం, హిందీ భాషలతో సాన్నిహిత్యం, సంపర్కం పట్టించుకోకుండానే అంతగా అభిమానించనక్కర్లేకుండానే రాజకీయమే కాదు, వ్యవహారాలు నడుస్తున్నాయి. హిందీ ఆధిపత్యాన్ని సహించే ప్రశ్నే లేదు. ఆంగ్ల భాషాభిమానం అంతంత మాత్రమే. తమిళనాడుకు చెందిన యువత, ఇప్పుడిప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు యింకా ఎక్కువ ఆలోచిస్తున్నారు. కుటుంబంలో, సమాజంలో, రాజకీయ పరంగా, సాహితీ పరంగాను విద్యావకాశాలు పొందడానికి తమిళ భాషా ప్రాధాన్యత కొనసాగినా, ఎంతవరకు అవసరమో అంతవరకే. కిటికీ తెరిచి ఇతర భాషా పవనాలు అక్కడకు ఆహ్వానించవలసిన అగత్యం తల ఎత్తింది.

ప్రవాసాలు, ప్రపంచీకరణ నేపథ్యం, సాంకేతిక ప్రజ్వలనం మాతృభాషా స్వరూప స్వభావాలను త్వరితగతిన మార్చివేసింది. స్వదేశీయ భాషలను ప్రోత్సహించాలని చెప్పే ఢిల్లీ పెద్దలు దక్షిణాది భాషల పట్ల ఆదరణ చూపించడం లేదు. దానికితోడు ప్రాథమిక స్థాయి నుంచి మాధ్యమంలో విద్యకు రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందే విధంగా విస్తృత చర్యలు చేపట్టాలి.

శతాబ్దాల చరిత్ర పరిశీలిస్తే తెలుగు జన సామాన్యం కూటికోసం, కూలికోసం సుదూర ప్రాంతాలకు తరలివెళ్లిన కథనాలు వున్నాయి. మారిషస్, దక్షిణాఫ్రికా, బర్మా, సింగపూర్, మలేషియాలకు భారతీయ, తెలుగు కార్మికులు తరలివెళ్లిన చరిత్ర అంతగా వెలుగు చూడలేదు. ప్రధానంగా తెలుగు ప్రాంతాల నుంచి శ్రామిక వలసల గురించి, చారిత్రక ఆధారాలు సేకరించి సాధికారంగా తెలియచెప్పే ప్రయత్నాలు జరగలేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విద్యాధికుల వలసలు విస్తరిస్తున్నాయి. అదే విధంగా గల్ఫ్ దేశాలకు తరలివెళ్లే శ్రామిక ప్రవాసం గురించి కాల్పనిక సాహిత్యం వచ్చినా, వాస్తవ చరిత్ర నిక్షిప్తంగానే వుంది. చెరుకుతోటల కట్టుబానిసల వ్యవసాయ కూలీల ప్రాచీన నేపథ్యం నుంచి, వెయ్యి, పదిహేను వందల క్రితంనాటి ప్రాచీన వలసల గురించి పరిశోధనాత్మక సాహిత్యం, తెలుగు చారిత్రక పరిశోధనలు వెలుగు చూడలేదు. తెలుగువారి ప్రాచీన సముద్రయాన విశేషాలు, ఇతర భూభాగాలలో రాజ్యాల స్థాపనలు, సీమాంతర తెలుగు రాజ్యాల కథలు కాలానికి అతీతంగా అతిశయించిన కాల్పనిక సాహిత్యంగా చిత్రించబడింది. కానీ పాఠ్యపుస్తకాలలో పిల్లలకు చెప్పలేదు. చారిత్రక నవలలలో విదేశీ, సముద్రయానం, అక్కడ మనవారి జీవన విధానాలు గురించి రాయగలిగిన సమాచారం, విషయ సేకరణ, 20వ శతాబ్ది తొలి దశాబ్దాలలో మన రచయితలు, కవులకు అందుబాటులో లేకపోవడం కారణం కావచ్చు.

తెలంగాణ ప్రాంతం నుండి అత్యధికంగా తెలుగువాళ్లు తరలివెళ్లారు. బర్మాలో తెలుగువాళ్లను 'తలైంగ్స్' అనేవారు. ఇండోనేషియా, మలేషియాలలో 'కళింగ' అనేవారు. కాల ప్రవాహంలో ఎన్నో చారిత్రకాంశాలు తెరమరుగయ్యాయి. గోదావరి నుంచి జావా దాకా.. జగము నేలిన తెలుగు, చరిత్రలోకి అన్వేషణా అవలోకనంలో శ్రీమతి డి.పి. అనూరాధ, 'అమ్మనుడి' మాసపత్రికకు ధారావాహికంగా వ్యాసాలు వెలువరించారు. ఆగ్నేయాసియా దేశాలలోని తెలుగు మూలాల్ని, చారిత్రక కట్టడాలని సందర్శించి 'జగము నేలిన తెలుగు' ఒక కాల్పనిక నవల ప్రచురింపచేసారు. అందులో 'మన్' భాష జోలపాట తెలుగులోకి అనువదించి వివరించారు. ఉయ్యాలలో పిల్లల్ని జోకొడుతూ 1500 ఏళ్లయినా ఆ పాట సజీవంగా ఉంది. ఆ పాటను రచయిత్రి తెలుగులోకి ఈ విధంగా అనువదించారు... "ఓ కొడుకా మన నేల తెలంగాణ. మన రాజుకు అదృష్టం బాగా లేక యుద్ధంలో ఓడిపోతే మనం పడవల్లో ఎర్ర రాళ్లున్న ఈ సువర్ణ భూమికి వచ్చాం" మట్టిలో కలిసిపోని సజీవ స్మృతిగా మన మాతృభాష మధురమైన అజరామర ఖ్యాతికి ఒక ఆనవాలు అది. ✦

# అహం అనర్థదాయకం

యామిజాల జగదీశ్

నేను తప్ప ఇంకెవరూ ఈ కార్యాన్ని చేయలేరు అని చెప్తూ రోజుల్ని గడిపేసే వారుంటూనే ఉంటారు.

గర్వం అనేది ఎలాగో మన తలలోకి వెళ్లి అక్కడి నుంచి అనవసరపు మాటలను పలికిస్తూ ఉంటుంది.

ఒకసారి అది తలకెక్కిందో దాన్ని కిందకు దించడం అంత సులభం కాదు. ఆంజనేయుడినీ ఈ గర్వం విడిచిపెట్టలేదు.

ఆనంద రామాయణం ఈ విషయం చెప్తోంది.

ఆంజనేయుడు సీతాన్వేషణకు బయలుదేరాడు కదా. అశోక వనంలో సీతాదేవిని చూసి తిరిగొస్తున్నాడు. ఆ సమయంలో ఆయనలోకి గర్వం ప్రవేశించింది. తాను చేసిన కార్యాలన్నింటిని వరుసగా తలచుకుంటూ వచ్చాడు.

అబ్బబ్బా.. ఎలాంటి కార్యాలను నేను చేశాను కదా. సముద్రాన్ని దాటాను, సీతాదేవి ఆచూకీని కనిపెట్టాను. రావణుడితో మాట్లాడాను, లంకలో నిప్పంటించాను. అక్కడి రాక్షసులందరినీ గడగడలాడించాను.

ఇలా తన గురించి గొప్పగా అనుకున్నాడు ఆంజనేయుడు. వెంటనే ఆయనలో గర్వం మొలకెత్తింది. అది క్రమంగా పెరుగుతూ వచ్చింది. దీనిని భగవంతుడు గ్రహించాడు. ఆంజనేయుడికి ఓ పాఠం చెప్పాలనుకున్నాడు.

కానీ ఆంజనేయుడు ఎంతో గర్వంగా గొప్పగా నవ్వుకుంటూ బలమైన గర్జనతో వస్తున్నాడు.

మార్గమధ్యంలో ఉన్నట్టుండి ఆయనకు దాహం వేసింది.

వెంటనే దాహం తీర్చుకోవాలనిపించింది. ఏం చేయాలా? అని ఆలోచించాడు.

ఆంజనేయుడు అలా అనుకుంటున్న ప్రదేశం మహేంద్ర పర్వతం. చుట్టూ చూశాడు.

దరిదాపుల్లో నీరున్న ప్రదేశం కనిపించలేదు. కాస్తంత దూరంలో ఓ మునీశ్వరుడు కూర్చుని ఉండటం చూశాడు. ఆయన ఎంతో ప్రశాంతంగా కూర్చుని ఉన్నాడు.

ఆంజనేయుడు తిన్నగా ఆయన వద్దకు వెళ్లాడు.

"ఓ మునివర్యా, రామచంద్రమూర్తి కోసం సీతాదేవిని వెతుక్కుంటూ వెళ్లి ఆచూకీ కనుక్కొని తిరుగు ప్రయాణమయ్యాను. చాలా దాహంగా ఉంది. నీళ్లుంటే ఇవ్వండి. ఒకవేళ మీ దగ్గర లేకుంటే ఎక్కడైనా నీళ్లుంటే చెప్పండి. అక్కడికి వెళ్లి దప్పిక తీర్చుకుంటానన్నాడు.

మునీశ్వరుడు నీళ్లున్న ప్రదేశం చెప్పాడు.



ఆంజనేయుడు అక్కడికి బయలుదేరాడు. అలా వెళ్లే ముందర సీతాదేవి ఇచ్చిన చూడామణి, రాముడి అంగుళీయం, బ్రహ్మదేవుడు ఇచ్చిన ఉత్తరం– ఈ మూడింటినీ ముని ముందు ఉంచి నీళ్ల తాగడం కోసం వెళ్లాడు.

కాస్సేపటికి ఇంకొక కోతి ఆ వైపుగా వచ్చింది. ముని ముందున్న మూడింటినీ తీసుకుంది. ముని పక్కన ఉన్న కమండలంలో వాటిని వేసి వెళ్లిపోయింది.

కోతి చేస్తున్న పనిని ముని గమనిస్తూనే ఉన్నారు. ఓ చిన్న నవ్వు నవ్వారు.

ఆంజనేయుడు దాహం తీర్చుకుని తిరిగొచ్చాడు.

ముని దగ్గర ఉంచినవేవీ కనిపించలేదు. దాంతో కంగారుపడ్డాడు. మునిని అడిగాడు. ఆయన కమండలం వైపు చూడమన్నారు.

ఆంజనేయుడు వెంటనే పరుగున వెళ్లి కమండలంలోకి తొంగి చూశాడు. ఆంజనేయుడికి ఆశ్చర్యమేసింది. ఆయన ముని ముందర పెట్టిన ఉంగరం లాంటి ఉంగరాలు అనేకం ఉన్నాయి. ఆంజనేయుడు అయోమయంలో పడ్డాడు.

"స్వామీ, ఇన్ని ఉంగరాలలో నేనుంచిన ఉంగరమేదో ఎలా కనుక్కోవడం?" అని అడిగాడు ఆంజనేయుడు.

అయితే ముని అతి నిదానంగా జవాబిచ్చారు "పుత్రా, రామావతారం జరుగుతున్న కాలంలో సీతను రావణుడు ఆకట్టుకోవడం, ఆ తరువాత ఆంజనేయుడు సీతాదేవి ఆచూకీ కనుక్కొని తిరిగి వస్తున్నప్పుడు ఉంగరాన్ని నా కమండలంలో వేయడం సహజం. అలా వేసిన ఉంగరాన్నే నువ్వు ఈ కమండలంలో చూస్తున్నావు" అని చెప్పారు పరమాత్మ.

ఆ మాట వినడంతోనే ఆంజనేయుడి తలకెక్కిన గర్వమంతా కిందకు దిగిపోయింది. బిడియపడుతూ మునివంక చూసాడు.

"స్వామీ, అలాగైతే ఇప్పటివరకు ఎందరు రాముళ్లు ఉన్నారు?" అని అడిగాడు ఆంజనేయుడు.

"కమండలంలోని ఉంగరాలను లెక్కించడం కష్టసాధ్యం కదా!" అన్నారు ముని.

"నాలాగా ఎందరో ఇటువంటి కార్యాలను చేశారు. వారిని మించిన పని నేనేమీ చేసుంటానని" అనుకున్నాడు ఆంజనేయుడు.

అనంతరం అంగదుడు ఉన్న చోటుకి వెళ్లాడు ఆంజనేయుడు. అతనితో కలిసి రాముడి దగ్గరకు వెళ్లాడు. ఆశ్రమంలో జరిగినదంతా చెప్పాడు.

అన్నీ విన్న రాముడు చిన్న నవ్వు నవ్వి ముని రూపంలో ఉన్నది నేనే. నీ మంచి కోసం ఈ నాటకమాడాను, కంగారుపడకు" అన్నాడు.

ముని ఆశ్రమంలో విడిచిపెట్టి వచ్చిన ఉంగరం రాముడి వేలిలో ధగధగలాడుతోంది. అది చూసి ఆంజనేయుడు ఆశ్చర్యపోయాడు.

ఆంజనేయుడు వెంటనే రాముడి పాదాలపై నడి నమస్కరించాడు. ఈ ఘటన తర్వాత ఏ విధంగానూ ఆంజనేయుడిలో గర్వం ప్రవేశించలేదు.

ఈ కథ ఎందుకంటే పరిస్థితులు ఎటువంటివైనా గర్వం అనేదానికి మనసులో చోటివ్వకూడదు అని చెప్పడానికే.

(మిగతా 28వ పేజీలో..)

ఆర్.సి.కృష్ణస్వామిరాజు

సింగిల్ పేజీ కథ

# పుచ్చు వంకాయలు

కూతురు 'కాగిత' కాకినాడలో కొత్తగా కాపురం పెట్టింది. అల్లుడు అరవింద్ ఎల్.ఐ.సి.లో అసిస్టెంట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొత్త సంవత్సరం వేడుకలు కూతురు, అల్లుడుతో కలిసి చేసుకుందామని అనుకున్నా డు కాగిత తండ్రి మేఘనాథం. మచిలీపట్నం నుంచి ఏసీ బస్సులో బయలుదేరాడు. తెల్లారేసరికి కాకినాడ చేరాడు. అల్లుడూ, కూతురూ అభిమానంగా పలకరించారు. 'చూడచక్కని జంట' అని సంతోషపడ్డాడు మేఘనాథం.

ఆరోజు డిసెంబరు 30వ తేదీ.

"మా నాన్నకు మునక్కాయలంటే మహా ఇష్టం. మార్కెట్‌కు వెళ్లి మునక్కాయలు తీసుకురండి" అని భర్త చేతికి బ్యాగు ఇచ్చింది.

"వెళ్లక తప్పదా?" అన్నట్లుగా ముఖం పెట్టాడు అరవింద్.

తప్పదన్నట్లుగా చెప్పకనే చెప్పింది కాగిత.

కాళ్లీడ్చుకుంటూ వెళ్లి మార్కెట్ అంతా తిరిగి ఇరవై రూపాయలు పెట్టి నాలుగు మునక్కాయలు కొనుక్కొచ్చాడు. తెచ్చినవి ముదురు మునక్కాయలని కాగిత తన మూతిని మూడు వంకర్లు తిప్పింది.

"నాకు ముదురు మునక్కాయలంటేనే ఇష్టం" అని సర్దిచెప్పాడు మేఘనాథం.

డిసెంబరు 31వ తేది.

"మా నాన్నకు పందిరి చిక్కుడుకాయలంటే ఇష్టం. పప్పులపొడి వేసి తాలింపు చేస్తే తృప్తిగా తింటాడు" అని చెప్పి మొగుణ్ణి మార్కెట్‌కి పొమ్మంది.

"నిన్నటిలాగా కాకుండా లేత చిక్కుడుకాయలు తీసుకురండి" అని జాగ్రత్త కూడా చెప్పింది.

"వేరే పని ఉంది కదబ్బా... సరేలే" అని సమాధానమిచ్చి మార్కెట్‌కి వెళ్లాడు అరవింద్.

తెచ్చిన చిక్కుడుకాయలను చూసి 'బ్యార్' అంది కాగిత. "ఏవి లేతవో, ఏవి వాడిపోయినవో తెలుసుకోకపోతే ఎలాగండీ?" అని నిష్టూరపడింది కాగిత.

"వాడిపోయినా, కాకినాడ చిక్కుడుకాయలు కమ్మగా ఉంటాయమ్మా!" అని అల్లుడిని వెనకేసుకు వచ్చాడు మేఘనాథం.

జనవరి ఒకటవ తేది.. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

"గుత్తివంకాయ కూరంటే మా నాయన గొంతు కోసుకుంటాడు. మార్కెట్ అంతా బాగా వెదికి, మేలైనవి ఏరి పట్టుకురండి" అని కోరింది కాగిత.

"పండుగనాడు కూడా పనులేనా?" అని ముక్కుతూ మూల్గుతూ మార్కెట్‌కి బయలుదేరాడు.

అల్లుడు ఇలా ముదురువి, వాడిపోయిన కూరగాయలు ఎందుకు తెస్తున్నాడో తెలుసుకోవాలనిపించింది మేఘనాథానికి.

అల్లుడి వెనకే బయలుదేరాడు. అల్లుడు గమనించకుండా జాగ్రత్త పడ్డాడు. వంకాయలమ్మే ఆమె దగ్గర నిలబడ్డాడు అల్లుడు. గంపలో ఉన్న పుచ్చు




వంకాయలను ఏరి, అర కేజీ ఇవ్వమని ఆమెను అడిగాడు. మొదట ఆమె ఆశ్చర్యపోయినా "పుచ్చు కాయలు ఏరి కోరి కొనుక్కునే తిక్కలోడు దొరికాడు, మంచి బేరం.. నక్కతోక తొక్కినట్లున్నాను" అనుకుని గబగబా అరకేజీ పుచ్చు కాయలు తూకమేస్తూ ఉంది.

దూరం నుంచి అంతా చూస్తున్న మేఘనాథం వెనుకనే వెళ్లి అల్లుడి భుజం తట్టాడు.

'క్యార్' అన్నాడు అల్లుడు అరవింద్.

"నిగనాగలాడే వంకాయలు ఉండగా పుచ్చు వంకాయలు ఎందుకు కొంటున్నావు అల్లుడూ?" అని అడిగాడు.

అల్లుడి ముఖం ఎర్రగడ్డలా అయింది.

"చూడాల్సినదంతా చూసేశాడు కదా మామ, నిజం చెప్పేద్దాం" అనుకుని ఇలా చెప్పాడు.

"మామా! మా అమ్మ చెప్పింది ఏమిటంటే భార్యను పెళ్లయిన నెలల్లోనే కంట్రోల్ చేయాలి. లేకుంటే మొగుణ్ణి కొంగున కట్టేసుకుంటుంది. ఆ పైన వాళ్లు ఆడిందిల్లా, పాడిందల్లా పాట అవుతుంది. అంతేకాదు, వాళ్ల కూర్చోమంటే కూర్చోవాలి, లెయ్యమంటే లేయాలి. అందుకని వాళ్లు ఏ పని చెప్పినా విరుద్ధంగా చేయ్. అప్పుడు నీకు పనులు చెప్పడం మానుకుంటారు. నిదానంగా అన్ని పనులు వాళ్లే చేసుకుంటారు. అప్పుడు నువ్వు కాలు మీద కాలేసుకుని కూర్చోవచ్చని చెప్పింది. అందుకని ఇలా చేస్తున్నాను" అన్నాడు.

పడీ పడీ నవ్విన మామ "మేడ్ ఫర్ ఈచ్ అదర్ లాంటి జంట మీది. ఒకరో ఇద్దరో అమ్మాయిలు మొగుణ్ణి డామినేట్ చేస్తారని, అందరినీ అలా అనుకుంటే పొరపాటు. పాత సినిమాల్లో సావిత్రి, అంజలీదేవి లాంటి మరోయిన్లను జత చేస్తే ఎంత మంచి ఇల్లాలు అవుతుందో అంత మంచిది నా కూతురు. నీకు అనుమానం వద్దు, సంస్కారం ముద్దు" అని సలహా ఇచ్చాడు.

"కొండంత మామ అండగా ఉంటానంటే భయం ఎందుకు?" అని అనుకున్న అరవింద్, పుచ్చు వంకాయలు పక్కన పడేసి లేత వంకాయలు కొనుక్కున్నాడు.

ఇంటికెళ్లి వంగ రంగు చీర కట్టిన కాగిత చేత గుత్తి వంకాయకూర, వెజిటబుల్ బిర్యానీ చేయించారు.

"వంకాయక వంటి కూర లేదు, శంకరుని వంటి దైవం లేదు" అనుకుంటూ వంకాయ కూర కడుపారా లాగించారు. ✦



ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# కణ్వమహర్షి తపస్సు చేసిన స్థలం

నారసింహుని నెలకొన్న ఆవేశం

దక్షిణ భారతదేశంలో శ్రీ నృసింహ ఆరాధన ఎక్కువ. అందుకే శ్రీ నృసింహ ఆలయాలు దక్షిణాదిన అధికం. తమిళనాడు, కర్ణాటక, కేరళలో చాలా విశేష నృసింహ ఆలయాలు ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాలలో కూడా అనేక పురాతన శ్రీలక్ష్మీ నారసింహ ఆలయాలు నెలకొని ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో స్వామి నడయాడిన క్షేత్రాలుగా పేర్కొనే నవ నారసింహ క్షేత్రాలు ఉన్నాయి. అవి అహోబిలం, సింహాచలం, వేదాద్రి, మంగళగిరి, అంతర్వేది, మాలకొండ(మాల్యాద్రి), పెంచలకోన, యాదాద్రి, ధర్మపురి.

శ్రీ వరాహ లక్ష్మీ నారసింహ స్వామి కొలువైన సింహాచలం, స్వామి లోకకంఠకుడైన హిరణ్యకశ్యపుని సంహరించిన ప్రదేశంగా ప్రఖ్యాతి గాంచిన అహోబిలం వీటిలో మొదటి వరసలో ఉంటుంది. ప్రతి ఒక్క క్షేత్రం తమవైన పురాణ గాథలు కలిగి వుండటం విశేషం. నారసింహ అవతారంలో స్వామి చెంచులక్ష్మి అమ్మవారిని వివాహం చేసుకొన్న స్థలంగా నెల్లూరు జిల్లాలోని పెంచలకోన(పెనుశిల) ప్రఖ్యాతి గాంచింది.

## క్షేత్ర గాథ

చుట్టూ పర్వతాలు, వాటి నుంచి జాలువారే జలపాతాలు.. నగర జీవితానికి భిన్నంగా వుండే ప్రశాంత వాతావరణం ఈ ఆలయ ప్రత్యేకత. కొండల మీద ప్రవహించే కండలేరు ఆలయ వెనుక భాగాన పెద్ద జలపాతంగా మారి నేలకు జాలువారుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో చాలా సుందరంగా ఉంటుందా దృశ్యం. గతంలో ఈ ప్రదేశం ఋషివాటిక. శ్రీ కణ్వమహర్షి తపస్సు చేసిన ప్రదేశమిది. ఈయన ప్రస్తావన అనేక పురాణాలలో కనిపిస్తుంది... ముఖ్యంగా మహాభారతంలో. మేనకా, విశ్వామిత్రుల పుత్రిక అయిన శకుంతలను పెంచిన తండ్రి కణ్వమహర్షి. శకుంతల కుమారుడైన భరతుని వల్లనే కదా మన దేశానికి భరతభూమి అన్న పేరు వచ్చిన విషయం మనందరికీ తెలుసు. కణ్వమహర్షి శ్రీ నారసింహుని గురించి తపస్సు చేసి స్వామివారి దర్శనాన్ని పొందిన స్థలం ఇదేనని అంటారు.

ఆలయ ప్రాంగణంలో శ్రీ కణ్వమహర్షి సన్నిధి కనిపిస్తుంది. అహోబిలంలో అసురరాజు హిరణ్యకశ్యపుని సంహరించిన తరువాత కూడా నారసింహుని నెలకొన్న ఆవేశం తగ్గలేదు. భీకరంగా గర్జిస్తూ నేటి నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తూ ఇక్కడికి చేరుకొన్నారట. ఆ సమయంలో అక్కడ స్నేహితురాళ్లతో కండలేరు తీరాన ఆటలాడుకొంటున్న చెంచుల ఇంటి ఆడపడచు చెంచులక్ష్మి స్వామి భీకర రూపం చూసి బెదరకుండా సమీపించి శాంతింపచేయడానికి కౌగిలించుకొన్నదట. కౌగిలించుకోవడానికి ఉన్న మరో పర్యాయ పదం 'పెనవేసుకోవడం'. ఆ పదం నుండి పుట్టిందే ఈ పెనుశిల. రాయి కన్నా కఠినంగా కనిపించే స్వామిని ఆదరంతో ఆప్యాయంగా హత్తుకొన్న ప్రదేశం ఈ పేరు కాలక్రమంలో పెంచలకోనగా మారింది. పర్వతాల నడుమ కోనలో ఉన్నందున, చెంచుల రాజ్యం వారి కన్యను అవతార పురుషుడు వారి కట్టుబాట్ల ప్రకారం వివాహం చేసుకున్నందున ఈ పేరు కూడా సమంజసంగానే కనిపిస్తోంది.

స్వామివారు శాంతించి చెంచులక్ష్మిని వివాహం చేసుకొని, అక్కడ నివసిస్తున్న స్వామివారి వద్దకు మహర్షులు వచ్చి తమకు సమీపంలోని భైరవకోనలోని అసురులతో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి తెలిపి వారి బాధను తొలగించమని ప్రార్థించారట.

భైరవకోన వెళ్లి స్వామి రాక్షసులను అంతమొందించి వచ్చి ఈ జలపాతంలో స్నానం ఆచరించారని, తన నరసింహ అవతారాన్ని చాలించారని చెబుతారు. ఈ కారణంగా భక్తులు ఇక్కడ కండలేరులో స్నానం చేయడం విధాయకంగా భావిస్తారు. తమలోని అసుర గుణాలు, చేసిన పాపాలు తొలగిపోతాయన్న భావం దీనిలో కనపడుతుంది.



## ఆలయ విశేషాలు

అనేక ఆలయాల మాదిరి పెనుశిల ఆలయాన్ని కూడా అనేక రాజ వంశాలవారు దర్శించి, అనేక కైకర్యాలు సమర్పించుకొన్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఉత్తరాభిముఖంగా ఉన్న అయిదు అంతస్థుల రాజగోపురం విజయనగర రాజుల నిర్మాణ శైలిలో కనపడుతుంది. కానీ కాలగమనంలో ఆలయం శిథిలావస్థకు చేరుకొన్నది.

చుట్టూ చెట్టూ చేమ పెరిగిపోయాయట. నిత్యం పశువులను తోలుకొని ఆ ప్రాంతానికి వచ్చే బోయ యువకునికి ఒక వృద్ధుడు కనిపించాడట. నిర్మానుష్యమైన అటవీ ప్రాంతంలో ఈయనను ఎప్పుడూ చూడలేదు. ఎవరీ ముసలివాడు? ఎందుకు ఒంటరిగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాడు? అన్న ఆలోచనతో యువకుడు ఆయన వద్దకు వెళ్లారట. ఆయన ఇక్కడ వెలసిన శ్రీ నృసింహుని సేవించుకోవడానికి వచ్చానని తెలిపారట. అతనికి ఈ నృసింహ క్షేత్రగాథ తెలిపి గ్రామస్థులకు కూడా తెలియచేయమని చెప్పారట. ఆనందంతో అంగీకరించిన బోయ యువకుడు తిరిగి వెళుతూ వెనక్కి తిరిగి చూడగా ఆ వృద్ధుడు పెద్ద శిలగా మారిపోతూ కనిపించారట.

అలా తెలియకుండానే స్వామివారిని సందర్శించుకొని మిగిలిన వారికి క్షేత్రం గురించి తెలియచేసిన ఆ గొల్ల బోయ యువకుని శిలా విగ్రహం నేటికీ పెంచలకోనకు సమీపంలో ఉన్నదని చెబుతారు.

సముద్ర మట్టానికి మూడు వేల అడుగుల ఎత్తులో తూర్పు కనుమలలో ఉన్న ఈ ఆలయం విశాల లోయలో నిర్మించబడింది. ప్రధాన ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అమ్మవారి సమేతంగా ఏకశిలా రూపంలో రమణీయ అలంకరణలో నేత్ర పర్వంగా దర్శనమిస్తారు.

## ఛాత్రవట నరసింహుడు

పెనుశిల నారసింహునికి మరో పేరు ఛాత్రవట నారసింహుడు. స్వామివారి ఆలయం వెనుక కొండలు గొడుగు రూపంలో ఉంటాయి. అదే విధంగా స్వామి భైరవకోనలో అసురులను సంహరించి తిరిగి వస్తుంటే ఋషులు ఆనందంతో గౌరవసూచకంగా స్వామికి ఛత్రం పట్టారట. ఈ కారణంగా ఈ పేరు వచ్చింది. నేటికీ భక్తులు తమ మొక్కుబడులలో భాగంగా వెండి, బంగారు గొడుగులు సమర్పించుకొంటుంటారు.

## క్షేత్ర పాలకుడు ఆంజనేయుడు

గమనిస్తే అనేక నరసింహ క్షేత్రాలకు వాయునందనుడు క్షేత్రపాలకునిగా దర్శనమిస్తారు. అదే విధంగా పెనుశిలలో కూడా శ్రీ ఆంజనేయుడు క్షేత్ర పాలకుడు. స్వామివారివి రెండు సన్నిధులు కనిపిస్తాయి. ఒకటి స్వయంవ్యక్తమూర్తి. పెద్ద రాతి మీద స్వామి ఒక పక్కకు తిరిగిన రూపంలో సింధూర వర్ణనలో శోభిల్లుతూ దర్శనమిస్తారు. రెండవది ప్రధాన ఆలయ ద్వారానికి ఎదురుగా రామదూత ప్రతిష్ఠించిన మూర్తి కొలువై ఉంటారు. హనుమంత సన్నిధి వెనుక ఆలయ పుష్కరిణి కండలేరు పవిత్ర జలంతో నింపబడి ఉంటుంది. బ్రహ్మోత్సవాలలో తిరుమంజనం నిర్వహిస్తారు. భక్తులు ఈ పావన కోనేరులో స్నానం చేస్తే శారీరక రుగ్మతలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. అడవుల గుండా ప్రవహిస్తూ వుండడం వల్ల వనమూలికల సారం ఈ నీటిలో ఉంటుంది అంటారు.



ఈ క్షేత్రంలో మరో ప్రత్యేకమైన విశ్వాసం కనిపిస్తుంది. పిల్లలు లేనివారు ఆలయానికి ఎదురుగా నేలమీద కొంతసేపు పడుకుంటే పిల్లలు పుడతారని చెబుతారు. దీనిని ‘వరపడి సేవ’గా పిలుస్తారు. అనేకమంది సంతానం లేని దంపతులు అలా చేసి సంతానాన్ని పొందారని, పొందుతున్నారు అని, అలా జన్మించిన పిల్లల బారసాల, అన్నప్రాసన, అక్షరాభ్యాసం.. మొదలైనవి ఇక్కడే జరిపించుకొంటారని తెలుస్తోంది.

## మహాలక్ష్మి సన్నిధి

ప్రాంగణంలో కండలేరు ప్రవాహం పక్కన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు స్వామి సన్నిధికి దూరంగా కొద్దిగా ఎత్తయిన ప్రదేశంలో నెలకొన్న సన్నిధిలో దర్శనమిస్తారు.

దీని వెనుక ఒక కథ వినిపిస్తుంది. స్వామి ఈ క్షేత్రంలో నరసింహ అవతారాన్ని విడిచి చెంచులక్ష్మిని వివాహం చేసుకొని ఇక్కడే నివాసం ఏర్పరచుకొన్నారు అన్న విషయం వైకుంఠంలో ఉన్న శ్రీ మహాలక్ష్మిదేవికి చేరిందట.

దేవేరి భూలోకానికి వచ్చి శ్రీవారు చెంచులక్ష్మిదేవితో వనాలలో విహరించడం కళ్లారా చూసి కినుక వహించి కండలేరు ఒడ్డున శిలారూపం దాల్చారట. ప్రతిరోజూ అమ్మవారికి నియమంగా పూజలు జరుగుతాయి. శ్రావణ మాసంలో విశేష పూజలు నిర్వహిస్తారు. పక్కన శ్రీ కణ్వ మహర్షి సన్నిధి దర్శించుకోవచ్చు.

ఇతర ఉపాలయాలలో శ్రీ కాళీయ మర్దన కృష్ణుడు, శ్రీ గరుడాళ్వార్ కొలువై ఉంటారు.

## పూజలు, ఉత్సవాలు

పెనుశిల శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి ఆలయం ఉదయం ఐదు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు; తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు భక్తుల దర్శనార్థం తెరిచి ఉంటుంది. ఉత్సవాలలో, పర్వదినాలలో భక్తుల రద్దీని అనుసరించి దర్శన వేళలు మారతాయి.

ప్రతిరోజూ నియమంగా అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, ఆరగింపులు జరుగుతాయి. శనివారాలు, పర్వదినాలు, సెలవు దినాలలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. స్వామివారి జన్మదిన సందర్భంగా వైశాఖ మాసంలో అయిదు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మన తెలుగు రాష్ట్రాల నుండే కాక తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. దేవస్థానం ఆధ్వర్యంలోని నిర్మించిన వసతి గృహాలు అద్దెకు లభిస్తాయి. భక్తులకు ప్రతిరోజూ ఉచిత అన్న ప్రసాద వితరణ జరుగుతుంది.

పెంచలకోన అభయారణ్యంతో కూడిన శేషాచలం కొండలలో అద్భుతమైన ప్రకృతికి, ఆధ్యాత్మిక పరిమళాలకు నిలయమై శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి కొలువైన పెనుశిల దివ్యక్షేత్రం నెల్లూరు పట్టణానికి ఎనభై కిలోమీటర్ల దూరంలో ఉన్నది. చక్కని, చిక్కని అడవుల గుండా సాగే మార్గం యాత్రికులకు ఆహ్లాదాన్ని అందిస్తుంది.

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# మాటే మంత్రం

మానవుడు సంఘజీవి. దైనందిన జీవితంలో నిత్యావసరాలకు, విషయ ప్రసారానికీ ముఖ్యమైన మాధ్యమం మాటే కదా! అది భాష వ్యక్తీకరణకు మార్గం. మాటే మనిషి సంస్కారాన్ని తెలియజేస్తుంది. వాక్కు వ్యక్తిత్వానికి ఒక వాచిక రూపంగా నిలుస్తున్నది. కొంతమంది చాలా జాగ్రత్తగా ఆచి, తూచి ఆలోచించి మాట్లాడతారు. అయితే మరికొందరు తొందరపాటుతో మాటలు జారి, దాన్ని సరిచేసుకునేందుకు నానాపాట్లు పడతారు.



'కాలు జారితే తీసుకోవచ్చు కానీ నోరు జారితే తీసుకోలేం' అని మనం తరచుగా వింటూనే వుంటాం. పెదవి దాటితే పృథ్వి దాటుతుందని వ్యాప్తిలో వున్న నానుడి. మనం ఎవరితో ఎప్పుడు ఎవరి గురించి, ఎందుకు, ఎలా, ఏ పరిస్థితుల్లో మాట్లాడాలో గుర్తెరిగి మాట్లాడాలి. అసలు మాట్లాడాల్సిన అవసరం వుందా లేదా అన్నది కూడా ఆలోచించుకోవాలి. ఇక మాటల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మీయత, నమ్మకం అనేవి కనపడాలి. ఒక విషయం గురించి మాట్లాడేటప్పుడు స్పష్టంగా, సూటిగా వుండాలి. అంతేకాదు, వినేవారికి సందేహ రహితంగా కూడా వుండాల్సి వుంది. లేదంటే ఆ మాటలు అపార్థాలకు దారి తీస్తాయి. సంబంధాలు చెడిపోతాయి. ఒక్కోసారి చిక్కుల్లో పడవేస్తాయి కూడా. సత్యం అయినాసరే అహితాన్ని చెప్పరాదు. హితం కదా అని అసత్యం చెప్పకూడదు. ఏది ఏమైనా చెప్పదలచుకున్నదాన్ని కఠినంగా చెప్పరాదు. ఇక వ్యవహారాల విషయానికొస్తే మొహమాటం అసలు పనికిరాదు. కచ్చితంగా మాట్లాడాలి. మిత్రులతో సమవయస్కులతో సరదాగా మాట్లాడుకోవచ్చు. భార్యతో చతురోక్తులతో సరదాగా మాట్లాడుకోవచ్చు. ఇక పెద్దలతో మాటలు వినయపూర్వకంగా వుండాలి. మాటలు పొదుపుగా ఉపయోగించాలి. ఇక చిన్నపిల్లలతో ప్రేమగానూ, ఆదరంగానూ, ప్రోత్సాహకరంగానూ వుండాలి. అమర్యాదగా మాట్లాడకూడదు. ముఖ్యంగా నూతన పరిచయస్తులతో మర్యాదగా మాట్లాడాలి. మాటకు విలువ లేని చోటా, మనోభావాలను అర్థం చేసుకోని వ్యక్తుల దగ్గర మాట్లాడరాదు. మౌనం ఉత్తమం.

మనం మాట్లాడే విషయంపై అవగాహన లేనప్పుడు మౌనంగా వుండటమే శ్రేయస్కరం.

నోటిదురుసుతనం, అనాలోచిత నిందారోపణలూ, అసూయాగ్రస్త అపవాదులూ, సమాజంలోనూ కుటుంబాల్లోనూ సామరస్యం వాతావరణాన్ని దెబ్బతీస్తాయి. మాట శక్తివంతమని గ్రహించిన నాయకులు దాన్ని తూటాలుగా ఉపయోగించుకుంటున్నారు. వారికి అది ఒక శక్తివంతమైన ఆయుధం. వంద తుపాకులు చేయలేనిది ఒక్క మాట చేస్తుందంటారు. అయితే మాట త్రికరణశుద్ధిగానూ, నిర్మలమైన చిత్తంతోనూ వుంటే దానికి శక్తి చేకూరుతుంది. దాన్నే వాక్శుద్ధి అంటారు. అలాంటి మాట ఒక విలువైన శక్తితో కూడి వుంటుంది. కొందరు మహానుభావుల, మహాత్ముల నోటి నుండి వచ్చే మాటలు జరిగి తీరుతాయంటారు. ఏది ఏమైనా మంచిగా మాట్లాడాలి.

ఇంకో ముఖ్య విషయం. వినడం కూడా తెలుసుకోవాలి. వినడం అనేది ఒక కళగా కూడా పెద్దలు చెబుతారు. మనమే ఎప్పుడూ మాట్లాడుతూ పోతుంటే, మనకు తెల్సిన వాటినే చెప్పిందే చెప్పుకుంటూ పోతూ వుంటాం. అలాగాక వింటూ వుంటే ఇతరుల అభిప్రాయాలనూ తెలుసుకోవచ్చు. కొత్త కొత్త ఆవిష్కరణలనూ అందుకోవచ్చు. పెద్దలు చెప్పినట్లుగా ఏ విషయాన్నీ పూర్తిగా వినకుండా ఏ నిర్ణయానికీ రాకూడదు.

అనుమానాలూ, సందేహాలూ వుంటే మాట్లాడి నివృత్తి చేసుకోవాలి. అలాగాక ఎదుటివారు ఎవరి గురించైనా మాట్లాడుతూ వుంటే, వారి అంతరంగాన్ని, చిత్తశుద్ధినీ, నిజాన్నీ గ్రహించగలగాలి. వినేటప్పుడు పెద్దల మాటలకు విలువనిచ్చి వినాలి. కొన్ని మాటలు కటువుగా వుండవచ్చు. హితులైనవారి మాటలు సదా స్వీకరించాలి. మనం విన్న మాటలను అర్థం చేసుకోవాలి.

శ్రీరామచంద్రుడు మితభాషి, మృదుభాషి, స్మితభాషి, పూర్వభాషి అన్న విషయం మనకు రామాయణం చదివితే ఇట్టే గ్రహించగలుగుతాం. కనుకనే రాముడు జనరంజకుడైనాడు. లోకాభిరాముడైనాడు. ఇక హనుమాన్ వాక్ వైభవం అపూర్వం. వారిని ఆదర్శంగా తీసుకుంటే మన మాటలు బంగారమవుతాయి.

(24వ పేజీ తరువాయి)

## అహం అనర్థదాయకం

ఆంజనేయుడు గర్వపడినట్లుగా నాకొక తెలిసిన వ్యక్తి ఎప్పుడూ గర్వాన్ని ప్రదర్శిస్తుండేవాడు.

"ఆంజనేయుడు ఎంతో కష్టపడి సీతాదేవి ఆచూకీ కనుగొన్నాడు. నేను అంతకన్నా కష్టపడి నేను నా ఉంగరాన్ని కనుగొన్నాను" అని చెప్పాడతను.

"ఎలా?" అని అడిగాను నేను.

"తాకట్టు పెట్టే దుకాణంలో కనుక్కున్నాను. నా భార్యే అక్కడ తాకట్టు పెట్టింది. నేను ఈరోజే దానిని విడిపించుకుని తీసుకు వస్తున్నాను. ఇక నాకు ఒక నెల వరకు గర్వం రాదు గాక రాదు" అని అన్నాడతను.

"అదెలా?" అని అడిగాను.

"ఈ నెల జీతమంతా అక్కడ కట్టేశానుగా. ఆ డబ్బంతా కడితేనేగా ఈ ఉంగరాన్ని విడిపించగలిగాను. చేతిలో చిల్లిగవ్వలేదు, గర్వం ఎలా వస్తుంది?" అని అడిగాడు.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్ వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



# లక్ష్మీ కటాక్షం కలగాలంటే?



## లక్ష్మీకళ – లక్ష్మీకటాక్షం

**ప్రశ్న: గురువుగారూ! లక్ష్మీదేవి సముద్ర గర్భం నుండి జన్మించింది. కనుక సముద్రంలో దొరికే రాళ్ల ఉప్పును నీళ్లల్లో కలుపుకుని స్నానం చేస్తే 'లక్ష్మీకటాక్షం' ఉంటుంది. డబ్బు బాధలు అనేవి ఉండవు.. అని కొంతమంది చాలా గట్టిగా నమ్ముతూ ఉంటారు. ఇది ఎంతవరకు నిజమంటారు?**

**జవాబు:** సముద్రపు గర్భం నుండి లక్ష్మీదేవి మాత్రమే కాదు. హాలాహలం కూడా పుట్టింది. ఇంకా ఎన్నో పుట్టాయి. మరి అప్పుడేమంటారు? కనుక సముద్రం వేరే సబ్జెక్ట్. లక్ష్మీదేవి, లక్ష్మీ కటాక్షం, లక్ష్మీకళ వేరే సబ్జెక్ట్. రాళ్ల ఉప్పును ఉపయోగించి వదనంలో లక్ష్మీకళను, జీవితంలో లక్ష్మీ కటాక్షాన్ని పొందగలిగే సులభమైన మార్గాలు ఉన్నాయి.

రాళ్ల ఉప్పులో 'నెగెటివ్ వైబ్రేషన్స్'ను విరిచేసే గుణం ఉంటుంది. మనకు కనిపించే చాలా పదార్థాల గుణాన్ని ఉప్పు మార్చివేయగలదు. అంతేకాక, మనకు కనిపించని అనేక వైబ్రేషన్స్ అంటే– ప్రకంపనాల గుణాన్ని, తీరును కూడా ఉప్పు మార్చగలదు. ఉదాహరణకి ఒక గ్లాసుడు మామూలు నీటిలో కొంత ఉప్పును వేస్తే, ఆ నీరు ఉప్పునీరుగా మారిపోతుంది. అంటే దాన్ని సహజ గుణం మారిపోయినట్టే కదా! (గుణాలు వేరు, ధర్మాలు వేరు).

మనిషి చుట్టూ ఉండే కాంతి వలయాలను లేదా ఇంటి లోపల ఉండే వైబ్రేషన్స్ శుభ్రపరచటానికి కూడా ఈ రాళ్ల ఉప్పును ఉపయోగిస్తారు. చాలామంది దృష్టికి సంబంధించిన సమస్యలు ఉన్నప్పుడు దృష్టిని తీసివేయడానికి ఉప్పును ఉపయోగిస్తారు. చిన్న పిల్లలు ఊరికే ఏడుస్తుంటే మన ఇంట్లో బామ్మలు/తాతయ్యలు 'వీడికి దిష్టి తగిలినట్టుంది. దిష్టి తీసేయాలి' అని అంటారు. ఒకసారి ఉప్పుతో దిష్టి తీసేస్తే, అంటే కొంత రాళ్ల ఉప్పును, కొన్ని ఎండుమిరపకాయలని గుప్పెట్లో పట్టుకొని సవ్యంగా కొన్నిసార్లు, అపసవ్యంగా కొన్నిసార్లు దిష్టి తగిలిన పిల్లల చుట్టూ తిప్పేసి నిప్పుల్లోకి పారేస్తే, పట పట శబ్దాలతో అవి కాలిపోతాయి. అదేదో 'మ్యాజిక్' జరిగినట్టు పిల్లలు కూడా ఏడుపు మానేస్తారు. చక్కగా నిద్రలోకి జారుకుంటారు. ఈ ప్రక్రియకు సముద్రపు రాళ్ల ఉప్పునే వాడాలి. దాన్ని 'సైంధవ లవణం' అని కూడా అంటారు. దానికి మాత్రమే రకరకాల నెగెటివ్ వైబ్రేషన్‌ను, అనేక విషయాలను విరిచేయగల సామర్థ్యం ఉంటుంది. ఒక్కొక్కసారి కొన్ని రకాల కీటకాలు కుట్టిన దగ్గర ఈ ఉప్పురాయిని పెడితే, అక్కడ మంట తగ్గిపోయి చల్లగా ఉంటుంది. విషం హరింపబడటం బాధితులు సులభంగా గ్రహించగలుగుతారు.

మనం స్నానం చేసేటప్పుడు కూడా కొంత సైంధవ లవణాన్ని (ఒక టీ స్పూను సరిపోతుంది) ఒక బకెట్ నీటిలో వేసుకొని, ఆ నీళ్లతో స్నానం చేయటం వల్ల మన ఒంటికి ఉన్న అనేక రకాల దోషాలు హరించివేయబడతాయి. అంతేకాకుండా శరీరం చుట్టూ ఉండే కాంతి వలయాలలో ఉండేటటువంటి అనేక రకాల నెగెటివ్ వైబ్రేషన్స్ కూడా శుద్ధి అవుతాయి. ఒంటి మీద ఉండే చిన్న చిన్న గాయాలను కూడా ఇది క్రమంగా తగ్గిస్తుంది.

ఇలాంటి ఉప్పు నీళ్లతో స్నానం చేయడం వలన ఒంటి పైన ఉండే దోషాలు, ఒంటి చుట్టూ వుండే వైబ్రేషన్స్‌లో ఉండే అనేక దోషాలు హరింపబడి మనసు తేలిక అవుతుంది. దోషరహితమైన దేహంలో కాంతి ప్రస్ఫుటమవుతూ ఉంటుంది. స్త్రీ, పురుష భేదం లేకుండా మొహం కళాకాంతులతో ఆకర్షణీయంగా తయారవుతుంది. దీనినే 'లక్ష్మీకళ' అంటారు. మనిషి ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటాడు. ఆలోచనలు బాగుంటాయి. సరైన నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపార వ్యవహారాలలో సైతం అనుకూల పరిస్థితులు, లాభాలు, ధన లాభం కలుగుతూ ఉంటాయి. ఈ పరిస్థితినే 'లక్ష్మీ కటాక్షం' అంటాం.

## అందరికీ తెలియకూడదా?

**ప్రశ్న: గ్రంథాలలో ఎన్నో విషయాలు ఉన్నాయని, అయితే కొన్ని ఎవరికీ తెలియకూడని 'సీక్రెట్స్' అని కూడా అంటారు. ఎందువల్ల?**

**జవాబు:** గ్రంథాలలో ఉండేదంతా జ్ఞానమే కదా! జ్ఞానం ఒక కత్తి లాంటిది. తినే పండ్లు కోసుకోవచ్చు. ప్రాణం తీయటానికి కత్తులు కూడా కోయవచ్చు.

అందువల్ల అది అర్హుల చేతిలో ఉంటేనే ఉపయోగముంటుంది. అనర్హుల చేతికి ఇస్తే అనర్థం వస్తుంది. అందుకే జ్ఞానాన్ని సీక్రెట్‌గా పెడతారు.

వాస్తువిద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్ వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు.................................................
పుట్టినతేదీ : ...................... ఊరు : .................
జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ...................
చిరునామా: .............................................



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. వ్యాపారాభివృద్ధి కోసం చేసే ఆలోచనలు ఫలిస్తాయి. షాపును రెన్యువేషన్ చేయించాలన్న ఆలోచనలు ముడిపడతాయి. హాస్పిటల్స్, డయాగ్నస్టిక్స్ సెంటర్స్ నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలరు ధరించండి. ప్రజల ఆదరణ పొందుతారు. ఆర్థికంగా బాగుంటుంది.

## వృషభం



వైద్య విద్య చేపట్టాలన్న ఆలోచనలు ముడిపడతాయి. ప్రయాణాలు లాభిస్తాయి. కుటుంబ సమేతంగా విహార యాత్రలు చేస్తారు. కుటుంబంలో ఏర్పడుతున్న స్పర్థలకు పరిష్కారంగా మంచి నిర్ణయాలను తీసుకుంటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. పెట్టుబడులకు సంబంధించిన ఆలోచనలు అంతంత మాత్రంగా ఉంటాయి.

## మిథునం



నూతన వస్త్రాలు, వస్తువులు కొనుగోలు చేస్తారు. సువర్ణాభరణాలను మార్పిడి చేసే ఆలోచనలు కలిసి వస్తాయి. ఆరోగ్య వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ఆర్థికంగా కొంత మందికి అభయ హస్తం ఇచ్చేముందు, ఒకటికి నాలుగు సార్లు ఆలోచించి ఇవ్వండి. నూతన ప్రణాళికలను వేయగలుగుతారు. మీ సలహాలు, సూచనలు కొంత మందికి ఉపయోగపడతాయి.

## కర్కాటకం



సఖ్యత లేని వ్యక్తులతో జీవితం గడపడం అనవసరం అని భావిస్తారు. ఏకాకిగా ఉండటం మంచి ఆలోచన కాదన్న భావన ఏర్పడుతుంది. నూతన గృహం కొనుగోలు గురించి ఆలోచిస్తారు. భూ సంబంధ వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. క్రయ-విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. విదేశీ ద్రవ్యం చేతికందుతుంది. భూ సంబంధ వ్యవహారాలు నిదానంగా సాగుతాయి.

## సింహం



శీతల పానీయాలు, ఆహార పదార్థాలు కొనుగోలు-అమ్మకాలు వ్యాపారస్తులకు, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారస్తులకు అనుకూలం. ప్రయోజనాలు ఆశించి కొంత మందికి ఉపకారం చేస్తారు. హనుమాన్ వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. వివాహాది శుభ కార్యాలకు సంబంధించిన కార్యక్రమాలు ముడిపడతాయి. శంకుస్థాపన ముహూర్తాలు కలిసొస్తాయి.

## కన్య



కొన్ని కార్యక్రమాల నిమిత్తం కొత్త రుణాలు చేస్తారు. రాజకీయాల్లో ఉన్నవారికి అనుకూలం. ప్రజా సంబంధ బాంధవ్యాలు మెరుగు పడతాయి. ప్రతి పనినీ కష్టపడి సాధించాలని అనుకుంటారు. ఓం నమశ్శివాయ వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. ఇతరుల మీద ఆధారపడకూడదని నిర్ణయించుకుంటారు. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటారు.

## తుల



పిల్లలతో, స్నేహితులతో సరదాగా గడుపుతారు. ఎన్ని పనులు వున్నప్పటికీ కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం సమయం కేటాయిస్తారు. జీవితాశయాన్ని సాధించడం కోసం కొన్ని పనులు ప్రారంభిస్తారు. సౌర కంకణం ధరించండి. ఆరోగ్యం మెరుగు పడుతుంది. మంత్రోపదేశం పొందాలన్న ఆలోచనలు ముడిపడతాయి. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. దేవీ దేవతలు పూజలు ప్రతిరోజూ చేసుకోవాలని ఆలోచిస్తారు.

## వృశ్చికం



విదేశాలకు వెళ్లే అవకాశాలు కలిసి వస్తాయి. మీ ఉత్పత్తులు విదేశాల్లో అమ్ముకోవడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. మానసిక సంతోషం, ధైర్యం కలిగి వుంటారు. ప్రతిరోజూ దేవతలకు ప్రథమ తాంబూలం సమర్పించండి. వ్యాపారంలో ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని మంచితనంతో, ఓర్పుతో ఎదుర్కొంటారు. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో రాజకీయ మంతనాలు చేస్తారు.

## ధనుస్సు



వృత్తిలో అనుకూలమైన మార్పులు ఏర్పడతాయి. సమస్యలు సృష్టించేవారు కార్యాలయంలో ఉన్నప్పటికీ వాళ్ల ఆలోచనలు తిప్పికొడతారు. నూతన కార్యక్రమాలను స్నేహితుల సహాయంతో ప్రారంభిస్తారు. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి అర్చన జరిపించండి. ఫుడ్ వ్యాపారస్తులకు కాలం అనుకూలం. శ్రమకు తగిన ఆదాయం అందుకుంటారు. రుణాలను తీర్చడంలో విఫలమవుతారు.

## మకరం



ఇంట్లో చోటు చేసుకునే చిన్నా పెద్ద విషయాలకు మీదే బాధ్యత వహించాల్సి వస్తుంది. అన్ని విధాలా అందరికీ దగ్గరవ్వాలని ప్రయత్నిస్తారు. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. కొంతమంది రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలతో నరదృష్టి బారిన పడి అవస్థకు గురవుతారు. అప్రమత్తంగా ఉండండి. నరఘోష యంత్రాన్ని ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాల్లోనూ పెట్టించండి.

## కుంభం




ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాల్లోనూ సాయంత్రంవేళ త్రిశూల్ పౌడర్‌తో ధూపం వేయండి. నరదృష్టి సోకకుండా ఉంటుంది. కుటుంబ సమేతంగా విహార యాత్రలకు వెళ్లాలన్న ఆలోచనలు వాయిదా వేయాల్సి వస్తుంది. సంతానం పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తారు. మహా పాశుపత కంకణం ధరించండి. ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది.

## మీనం




దీర్ఘకాలికంగా వేధిస్తున్న వ్యవహారాల ఉండి సునాయాసంగా బయట పడగలుగుతారు. మధ్యవర్తుల ద్వారా చేసే ప్రయత్నాలు పంపే రాయబారాలు ఉపకరిస్తాయి. మీరు చేసే పనులను కొంతమంది గుర్తించడం ఎంతగానో నచ్చుతుంది. ఏ ఆశ లేని చోట ఒక కొత్త ఆకాంక్ష చిగురిస్తుంది. గృహోపకరణాలను అధునాతన, సాంకేతిక వస్తువులను పరికరాలు కొనుగోలు చేస్తారు. శుభ వార్తలు వింటారు.

# ఈ వారం 'కార్టూన్స్'


ఇప్పుడు ఆటోలకు మీటర్లు లేవన్నా.. అవి తిరిగే స్పీడుకు జనాలకు హార్ట్ ఎటాక్ వస్తున్నదని తీసేసారు!!


వీడు కల్తీ గంజాయి.. కల్తీ డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు.. ఏం కేసు బుక్ చేయాలి సార్..!?
డ్రగ్స్ & నార్కోటిక్స్ -


తగ్గలేదా? కంగారు పడకు.. అన్ని గాయాల్ని కాలమే మాన్పుతుంది!!



ఊయల అంటే ఇష్టపడనివాళ్లు ఎవరూ ఉండరేమో! కానీ ఈ ఉయ్యాల్లో ఊగటానికి చాలా.. చాలా ధైర్యం ఉండాలి. ఇటలీలోని మాంటీ పియనా పర్వతాల్లో 'ఇంటర్నేషనల్ హైలైన్ మీటింగ్' పేరుతో ప్రతి సంవత్సరం స్కై క్యాంపింగ్‌ను నిర్వహించుకుంటారు. కొన్ని వందల అడుగుల ఎత్తులో రెండు పర్వతాల మధ్య తాడు సహాయంతో ఉయ్యాలలు కట్టుకుని అత్యంత ధైర్యవంతులు కాలక్షేపం చేస్తారు. సేఫ్టీ బెల్టులున్నా ధైర్యం కావాలిగా!











